
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 4 జనవరి 2024 | 5





# అక్రమార్కులపై కొరడా!



- అక్రమ ఇసుక తవ్వకాలపై హైకోర్టు ఆగ్రహం
- నాలుగు వారాలలో సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వాలని ఆదేశం
- అయినా.. ఆగని ఇసుక తవ్వకాలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అక్రమ ఇసుక తవ్వకాలపై హైకోర్టు సీరియస్ అయింది. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ పరిధిలోని ర్యాంపుల నుంచి అఖండ గోదావరిలో డ్రెడ్జింగ్ చేస్తూ అక్రమంగా ఇసుక తవ్వేస్తున్నారని ధవళేశ్వరం పరిధిలోని గాయత్రీ ర్యాంపులకు సంబంధించి ఒకరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో గతంలోనే ఇసుక అక్రమ తవ్వకాలు అన్ని చోట్ల ఆపివేయాలని ఆదేశించింది. కానీ ఆపక పోగా, రాత్రి పగలూ వందలాది డ్రెడ్జింగ్ పడవలతో అఖండ గోదావరిని గుల్ల చేస్తూ కోట్లాది రూపాయల విలువైన ఇసుక వ్యాపారం జరిగిపోతోంది. మే నెలలోనే ఇసుక కాంట్రాక్టర్ గడువు ముగిసినా, కొత్త కాంట్రాక్టు ఎవరికీ ప్రభుత్వం ఇవ్వకపోయినా ఇసుక తవ్వకాలు ఆగలేదు. ఈ వ్యవహారంపై వేసిన కేసు మళ్లీ బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరపు న్యాయవాది నర్రా శ్రీనివాస్.. న్యాయమూర్తి ముందుకు పలు విషయాలు తీసుకుని వెళుతూ, గతంలో గౌరవ హైకోర్టు ఆదేశించినా అక్రమ తవ్వకాలు ఆపలేదని, ప్రస్తుతం కూడా తవ్వేస్తున్నారని, డ్రెడ్జింగ్ కూడా చేస్తున్నారని, ఆధారాలతో చూపించడంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పందించారు. అధికార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై రాజమహేంద్రవరం ఎస్పీకి ఆదేశాలిచ్చి, నాలుగు వారాలలోగా సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆయన నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు ఉంటాయని కోర్టు స్పష్టంచేసింది. దీంతో గాయత్రీ, కోటిలింగాల, కాతేరు, వెంకటనగర్ తదితర ప్రాంతాలకు చెందిన ర్యాంపుల ద్వారా డ్రెడ్జింగ్ చేస్తున్న వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మే నెల నుంచి ఇప్పటికూ లక్షల టన్నుల మేర ఇసుక తవ్వేశారు. రూ.వందల కోట్లు అక్రమాలకు పాల్పడ్డారు. ఇందులో కొందరు వెనుక వైసీపీ నేతలు ఉండడం గమనార్హం. ఇంతవరకూ ఆధారాలు లేకుండా ఇసుక తవ్వేయడం వల్ల.. ఇవాళ ఎవరిని బాధ్యులను చేస్తారో చూడాలి. ఇన్ని అక్రమాలు జరుగుతున్నా, అనుమతులు లేకుండా ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నా చోద్యం చూస్తున్న అధికారులు ఏమి సమాధానం చెబుతారో మరి. అక్రమ ఇసుక వ్యాపారులు, వారికి సహకరించిన ర్యాంపుల నిర్వాహకులు, మౌనం వహించిన అధికారులు కూడా బాధ్యులే అవుతారనే వాదన మొదలైంది. ఇప్పటికైనా ఇసుక దోపిడీ ఆపుతారోలేదో గురువారం నాటికి స్పష్టత ఉంటుంది. దీనిపై నివేదిక ఇవ్వడం కూడా పోలీసులకు సవాలే. ఆధారాలు చూపడానికి ప్రయత్నిస్తే దొంగలెవరో తేలుతుంది. చివరకు దొంగచాటున ఉన్న వ్యాపారి వద్ద నుంచి కేవలం టన్నుకు రూ.150 నుంచి రూ.200 వరకూ తీసుకుంటూ డ్రెడ్జింగ్‌తో భారీగా ఇసుక తవ్విస్తున్నా ర్యాంపుల నిర్వాహకులతోపాటు పట్టించుకోని అధికారులు బలైపోయే ప్రమాదం కూడా ఉంది.



సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట టీచర్ల నిరసన దీక్ష.. మాట్లాడుతున్న కేఎస్ఎస్ ప్రసాద్

## టీచర్లపై రాష్ట్ర ప్రభుత్వం అణచివేత ధోరణి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 3: టీచర్లపై రాష్ట్ర ప్రభుత్వం అణచివేత ధోరణి సాగిస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. రావాల్సిన డీఏలు, ఎరియర్స్ తక్షణమే చెల్లించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఎవరైతే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయడానికి సమ్మతిస్తారో వారికే బాహాటంగా తమ మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు. బుధవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో 12 గంటల ఆందోళన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ 1వ తేదీనే జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తూ టీచర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే జనవరి 9, 10 తేదీల్లో విజయవాడలో 36 గంటల భారీ నిరసన కార్యక్రమం చేపడతామని స్పష్టంచేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీలు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు, ఉపాధ్యాయులు రోడ్డెక్కి పోరాటాలు చేస్తుంటే సీఎం ఏమీ ఎరగనట్టు తాడేపల్లిలో కూర్చుని ఆడుదాం ఆంధ్ర అనడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షుడు జయకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, జిల్లా మహిళా అసోసియేట్ విజయగౌరీ, ఆర్థిక కార్యదర్శి ఈవీవీఎస్ఆర్ ప్రసాద్, కాకినాడ జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు నగేష్‌బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు శంకరుడు మాట్లాడారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

## కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల బైఠాయింపు

రాజమహేంద్రవరం రూరల్ జనవరి3: అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం బెదిరింపుల వైఖరి మానుకోవాలని, జగన్ సర్కార్ శంకరగిరి మాన్యాలు పట్టడం ఖాయమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల జిల్లా నలుమూలల నుంచి సుమారు 3 వేల మంది చేరుకొని బైఠాయించి నిరసన తెలిపారు. శిబిరం వద్దకు ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు విచ్చేసి మద్దతు పలికారు. ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్ అంగన్‌వాడీలకు ఇచ్చిన వేతనాల పెంపు హామీని అమలుచేయమని అంగన్‌వాడీలు అడిగితే వేధించడం ఎంతవరకు సబబు అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం సుందరబాబు, బి రాజులోవ, ఎస్ఎస్ మూర్తి, కేఎస్వీ రామచంద్రరావు, ఎస్ భగవత్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె బేబీరాణి తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా కలెక్టరేట్ వద్ద చేస్తున్న అంగన్‌వాడీల దీక్షా కార్యక్రమానికి వెళ్లి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సంఘీభావం తెలిపారు.



ధర్నా చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మధు, మునిసిపల్ వర్కర్లు

## హోరెత్తిన పారిశుధ్య కార్మికుల ఆందోళన

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 3: మునిసిపల్ పారిశుధ్య కార్మికులు బుధవారం సమ్మెలోకి వెళ్లారు. పర్మినెంట్ చేయాలని లేదా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్‌చేస్తూ రాజమహేంద్రవరంలో కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించి కార్పొరేషన్ కార్యాలయం మెయిన్ గేట్ వద్ద బైఠాయించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగగా, కార్మికుల సమ్మెకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ మద్దతు తెలిపారు. కాగా కార్మికులను కమిషనర్ దినేష్‌కుమార్ కలిసి సమ్మె విరమించాలని కోరారు.



ఇసుక అక్రమాలపై పోలీసులకు వినతిపత్రం ఇస్తున్న వెంకట రమణచౌదరి

## యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న టీడీపీ నాయకులు
- ఆరు గంటలపాటు నిరసన

సీతానగరం, జనవరి3: సీతానగరం మండలం మునికూడలి గ్రామంలోని ఇసుక ర్యాంపు వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేయడమే కాకుండా రైతుల అనుమతి లేకుండా పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు జరపడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ బుధవారం సాయంత్రం టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు ఆందోళన చేపట్టారు. ముందుగా ఇసుక లోడింగ్ చేస్తున్న ప్రదేశాలను పరిశీలించి రైతుల పట్టాభూముల్లో తవ్వకాలు జరిగాయని నిర్ధారణ చేసుకున్నారు. డిమార్కేషన్, మైనింగ్ శాఖ మార్కింగ్‌లు లేవు. నిబంధనలకు విరుద్ధంగా 15 అడుగుల లోతు వరకు తవ్వేస్తున్నారు. అధిక లోడింగ్‌తో వాహనాలు ద్వారా తరలించుకుపోతున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిసెంబర్ 22న టెండర్ వేస్తే అప్పటికే డిసెంబర్ 4 నుంచి తవ్వకాలు మొదలుపెట్టారని, ఇదేం పద్ధతని అక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జులను ప్రశ్నించారు. వారు దానికి సమాధానం చెప్పకపోవడంతో అసలు ఇచ్చిన అనుమతులు, మైనింగ్ శాఖ ఇచ్చిన మార్కింగ్‌లు గాని చూపించాలని గ్రామంలో టెంటు వేసుకుని ఆందోళన దిగారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని చర్చలు జరిపారు. రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని రెండు రోజుల్లో పూర్తి పత్రాలన్నీ చూపిస్తామని చెబుతూ డీఎల్ఎస్సీ ద్వారా వచ్చిన ప్రతిపాదనలను చూపారు. రాత్రి పది గంటల వరకు ఆందోళన కొనసాగగా, అనుమతులు చూపించే వరకు తవ్వకాలు జరపమని హామీ ఇవ్వడంతో చివరకు నిరసనను విరమించుకున్నారు.

# పింఛను వంచన!



- అంకెల గారడీతో బురిడీ
- జిల్లాలో 777 పింఛన్ల తీసివేత
- కొత్తవి 3 వేలని అసత్యాలు
- డిసెంబరు 1కి 2,39,191
- జనవరి 1కి 2,38,414
- ట్రాన్స్‌జెండర్లకు కొత్తగా 1
- హెచ్ఐవీ వారివి 40 ఉఫ్
- అందరితోపాటే దివ్యాంగులు
- దివ్యాంగ 3%, వృద్ధాప్య 1%..
- వితంతు పింఛన్లలో 2% పెంపు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పింఛన్ల లబ్ధిదారుల సంఖ్యలోనూ జగన్ మార్కు వంచన కనబడుతోంది. అబద్ధాల జాడ్యం పింఛన్లనూ వదల్లేదు. పదికి పది కలిపితే ఇరవై అవుతుంది. కానీ.. పాలకుల గణాంకాలను పరిశీలిస్తే పదే వస్తుంది. అయితే జనాలకు మాత్రం యాభై అని చూపెడుతూ పబ్బం గడిపేస్తున్నారు. 'ఏడాదికి ఏడాది పింఛనుదారుల సంఖ్య పెరుగుతోంది.. లక్షల కోట్ల రూపాయలు ధార పోస్తున్నాం'.. అనే మాటలను అంకెల గారడీ వెక్కిరిస్తోంది. ఎప్పటికప్పుడు లబ్ధిదారుల్లో కోత విధించి.. ఆ మేరకు కొత్త వాటిని మంజూరు చేసి 'లెక్క' సరిచేస్తున్నారు. అంటే 'ఒకరిని కొట్టి మరొకరికి పెట్టు' అనే తీరు ప్రభుత్వ లెక్కల్లో కనిపిస్తోంది. కొత్తగా దరఖాస్తు చేసుకుంటున్న వారి పింఛను మాత్రం కాగితాలకే పరిమితమవుతోంది. గత నాలుగేళ్ల నుంచీ ఇదే తంతు నడిపిస్తూ ఎక్కడోచోట జగన్ 'బటన్' నొక్కి హంగామా చేస్తూనే ఉన్నారనే విమర్శలు వినవస్తున్నాయి.

### మోసం ఇలా..



జిల్లాలోని అభయహస్తంతో కలుపుకొని మొత్తం 17 కేటగిరీల్లో పింఛన్లు ఇస్తున్నారు. వీటిలో దివ్యాంగులు, వృద్ధాప్య, ఒంటరి మహిళ, ట్రాన్స్‌జెండర్, వితంతు, కల్లుగీత కార్మికులు, చర్మకారులు, నేత కార్మికులు ఇలా 8 విభాగాలకు చెందిన లబ్ధిదారులకు నెలకు రూ.2,750 ఇస్తున్న పింఛన్‌ని జనవరి నుంచి రూ.3 వేలు చేశామని ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పుకుంటోంది. కానీ ఆ మేరకు సరిపెట్టడం కోసం 11 కేటగిరీల సంఖ్యల్లో కోత విధించి.. ఐదు విభాగాల వాళ్ల సంఖ్యను కొద్దిగా పెంచారు. దివ్యాంగ లబ్ధిదారుల సంఖ్యలో 155 కోతపెట్టి 1022 కొత్తవి కలిపారు. ట్రాన్స్‌జెండర్లకు 1, వృద్ధాప్య 603 తీసేసి 1452, ఒంటరి మహిళ 17 లాగేసి 28, వితంతు పింఛన్లు 57 తొలగించి 1459 మంజూరు చేశారు. జిల్లాలో వృద్ధాప్య 603, కిడ్నీ తదితర రోగులవి 4, డప్పు కళాకారులు 4, దివ్యాంగులు 155, కళాకారులు 1, మత్స్యకార 7, ఒంటరి మహిళ 17, కల్లుగీత 3, నేత 4, వితంతు 57, హెచ్ఐవీ బాధితుల 40 పింఛన్లను తొలగించారు. ప్రతీ నియోజకవర్గంలోనూ లబ్ధిదారుల సంఖ్యను ఎంతోకొంత తగ్గించారు. అనపర్తి నియోజకవర్గంలో 75, గోపాలపురం 102, జగ్గంపేట (గోకవరం) 18, కొవ్వూరు 41, నిడదవోలు 113, రాజమహేంద్రవరం అర్బన్ 121, రూరల్ 76, రాజానగరం నియోజకవర్గంలో 133 మంది లబ్ధిదారులను పింఛన్ల జాబితా నుంచి కోసేశారు. దివ్యాంగులనూ ప్రభుత్వ మోసం వదల్లేదు. జిల్లాలో ఇప్పటివరకూ 32,597 మందికి పింఛను అందుతుండగా ఆ సంఖ్యను 32,442కి పరిమితం చేసి 1,022 కొత్తవి ఇచ్చినట్టు చూపిస్తున్నారు. దివ్యాంగులకు ఉండే ప్రత్యేక పరిస్థితుల వల్ల వాళ్లకు కాస్త ఎక్కువ మొత్తంలో పింఛను ఇచ్చేవారు. సాధారణ కేటగిరీలకు రూ.2 వేలు ఇచ్చినా వారికి రూ.3 వేలు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు రూ.2,750 తీసుకునే వాళ్లతో వీరి పింఛను సమానమైపోయింది. దీంతో ప్రభుత్వం మాపై చూపించే అదనపు దయ ఏముందంటూ దివ్యాంగులు ఆవేదన చెందుతున్నారు.

### గారడీ ఇలా..

పాలకులు ప్రచార ఆర్భాటానికి ప్రగల్భాలు పలుకుతున్నా గణాంకాలు మాత్రం గారడీని బయట పెడుతున్నాయి. దాని అధికారులు కూడా సై అనడమే ఇక్కడ విషాదం. పింఛన్లు పెరగకుండానే అంకెల గారడీకి కొందరు అధికారులు సైతం భాగస్వాములవుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వ లెక్కల ప్రకారం అభయహస్తం కాకుండా అమరావతి ల్యాండ్‌లెస్ పూర్, కిడ్నీ తదితర వ్యాధిగ్రస్తులు, డప్పు కళాకారులు, దివ్యాంగ, డీఎంహెచ్ఓ, కళాకారులు, సైనిక సంక్షేమ, ట్రాన్స్‌జెండర్, మత్స్యకార, వృద్ధాప్య ఒంటరి మహిళ, కల్లుగీత, చర్మకార, నేత కార్మికులు, వితంతు పింఛనుదారులు మొత్తం కలిపి డిసెంబరు1కి 2,36,759కి హెచ్ఐవీ బాధితులు 2,432 మందిని కలుపుకుంటే 2,39,191 మంది లబ్ధిదారులు ఉన్నారు. అదే జనవరి 1కి వచ్చేసరికి 2,36,022 మందికి హెచ్ఐవీవారు 2,392 కలుపుకుంటే మొత్తం లబ్ధిదారులు 2,38,414 మందిగా ఉన్నారు. అంటే 777 మందిని తొలగించినట్టు తెలుస్తోంది. దివ్యాంగుల లబ్ధిదారుల్లో 3శాతం, వృద్ధాప్య 1 శాతం, వితంతు లబ్ధిదారుల్లో 2శాతం స్వల్ప పెరుగుదలకు మాత్రమే ప్రభుత్వం కనికరించింది.

### అన్యాయం అలా..

ఓవైపు పీడిస్తున్న వ్యాధులకు పాలకుల తీరు తోడై బాధితులను మరింత ఆవేదనకు గురిచేస్తోంది. డిసెంబరులో ఉన్న లబ్ధిదారులను జనవరిలో తొలగించినట్టు గణాంకాల్లో చూపించారు. ఒక్కరికి కూడా కొత్తగా మంజూరు చేయలేదు. ఉదాహరణకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకు సుమారు 600 వరకూ హెచ్ఐవీ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. సుమారు 20 మందికి పాజిటివ్ వస్తోంది. వీరి వివరాలు ప్రభుత్వం వద్ద ఉంటాయి. కానీ ఒక్క కొత్త పింఛను కూడా మంజూరు చేయకపోగా 40 పింఛన్లను తొలగించారు. డిసెంబరు 1కి 2432 ఉన్న వారి పింఛన్ల సంఖ్య జనవరి 1కి 2392కి పడిపోయింది. పాలకుల తెలివితేటల గొప్పతనం చెప్పడానికి కిడ్నీ తదితర వ్యాధిగ్రస్తుల లబ్ధిదారుల సంఖ్య చాలు. ఆ లబ్ధిదారుల ప్రభుత్వ కేటగిరీలో 4 తొలగించి.. ప్రైవేటు విభాగంలో 4 తగిలించి లెక్క సరిపెట్టారు. అలాగే ట్రాన్స్‌జెండర్లకు ఒకేఒక్క కొత్త పింఛను మంజూరు చేశారు. వాళ్లను ట్రాన్స్‌జెండర్ ఆపరేషన్ జరిగినట్టు సర్టిఫికెట్ తెచ్చుకోమని చెప్పడంతో ఇబ్బంది తలెత్తుతోంది. ఎప్పుడో జరిగిన ఆపరేషన్‌కి సర్టిఫికెట్ ఎలా తెచ్చుకుంటామని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఉదాహరణకు రాజమహేంద్రవరంలోని స్టేడియం సమీపంలో 30 మందికి ఇదే సమస్య ఎదురై పింఛను అందలేదు. ఏదొక మెలికపెట్టి పింఛన్లు ఎగ్గొడుతున్నారని వారు వాపోతున్నారు.

### లెక్కలు ఇలా..

| కేటగిరీల వారీగా | లబ్ధిదారులు డిసెంబరు1కి | జనవరి1కి |
|---|---|---|
| అమరావతి ల్యాండ్‌లెస్ | 3 | 3 |
| కిడ్నీ తదితర(ప్రభుత్వ) | 197 | 193 |
| కిడ్నీ తదితర(ప్రైవేటు) | 249 | 253 |
| డప్పు కళాకారులు | 757 | 753 |
| దివ్యాంగ | 32597 | 33464 |
| డీఎంహెచ్‌వో | 1467 | 1580 |
| కళాకారులు | 156 | 155 |
| సైనిక సంక్షేమ | 18 | 18 |
| ట్రాన్స్‌జెండర్ | 58 | 59 |
| మత్స్యకార | 1949 | 1942 |
| ఒంటరి మహిళ | 9160 | 9171 |
| కల్లుగీత కార్మికులు | 2502 | 2499 |
| చర్మకారులు | 864 | 864 |
| నేత కార్మికులు | 1351 | 1347 |
| వితంతు | 63609 | 65011 |
| హెచ్ఐవీ(ఏఆర్టీ) | 2432 | 2392 |


















# సంక్రాంతికి ఆర్టీసీ సన్నద్ధం



ప్రయాణికులతో రద్దీగా ఉన్న రాజమహేంద్రవరం బస్ కాంప్లెక్స్

**హైదరాబాద్ నుంచి వచ్చే ప్రయాణికులపైనే ప్రధాన దృష్టి**

**స్పెషల్ బస్సులు 68, షెడ్యూల్ బస్సులు 11**

**10వ తేదీ నుంచి 'హైదరాబాద్ ఆపరేషన్' ప్రారంభం**

**స్పెషల్ బస్సుల్లోనూ సాధారణ చార్జీలే**

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 3: సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపనుంది. హైదరాబాద్‌తో పాటు విశాఖపట్నం, విజయవాడ రూట్లలోనూ ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రధానంగా, హైదరాబాద్ నుంచి వచ్చే పండగ ప్రయాణికులపైనే జిల్లా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇప్పటి వరకూ నిర్ణయించిన ప్రకారం ఈనెల 10, 11, 12, 13 తేదీల్లో హైదరాబాద్ నుంచి జిల్లాకు మొత్తం 79 సర్వీసులు నడుపుతారు. జిల్లాలోని రాజమహేంద్రవరం, గోకవరం, కొవ్వూరు, నిడదవోలు నాలుగు డిపోల నుంచి 68 స్పెషల్ సర్వీసులు హైదరాబాద్‌కు నడుపుతారు. రాజమహేంద్రవరం డిపో నుంచి 42, గోకవరం డిపో నుంచి 16, నిడదవోలు డిపో నుంచి 3, కొవ్వూరు డిపో నుంచి 7 స్పెషల్ బస్సులు నడపనున్నారు. ఈ స్పెషల్స్‌కు అదనంగా రెగ్యులర్‌గా వెళ్లే మరో 11 షెడ్యూలు బస్సులు నడుస్తాయి. ఇలా మొత్తం 79 సర్వీసులను హైదరాబాద్‌కు తిప్పడానికి చర్యలు చేపట్టారు. పెద్ద పండుగ ముగించుకుని తిరిగి వెళ్లే ప్రయాణికుల కోసం కూడా స్పెషల్ బస్సులు నడపాలని భావిస్తున్నా ముందుగా హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికులు టార్గెట్‌గా స్పెషల్ బస్సులను సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉంటే, విజయవాడ, విశాఖపట్నం రూట్లలోనూ స్పెషల్ బస్సులు నడపాలని అధికారులు యోచిస్తున్నారు. పండక్కి ఒకటి, రెండు రోజుల ముందు నుంచి ఈ రెండు రూట్లలో స్పెషల్ సర్వీసులు నడిపితే చాలనే అభిప్రాయం ఉంది.

### రష్ బాగుంది.. టిక్కెట్లున్నాయి ...

పెద్ద పండుగ రోజుల్లో హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే ప్రయాణికులు భారీ సంఖ్యలో ఉంటారు. దీంతో సాధారణంగా ప్రతి ఏటా ఆర్టీసీ సర్వీసులకు మంచి ఆదరణ ఉంటుంది. దీనికితోడు ఈ ఏడాది స్పెషల్ సర్వీసుల్లోనూ సాధారణ చార్జీలు మాత్రమే వసూలు చేయడంతో ఆర్టీసీ బస్సులకు మంచి డిమాండ్ నెలకొంది. ప్రస్తుతం ముందస్తు రిజర్వేషన్లు జోరుగా జరుగుతున్నాయి. రష్ బాగుందని, అయితే టిక్కెట్లు దొరకని పరిస్థితి లేదని ఆర్టీసీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. హైదరాబాద్ నుంచి జిల్లాకు వచ్చే అన్ని బస్సుల్లోనూ దాదాపు 70 శాతానికి పైగా రిజర్వేషన్లు పూర్తయ్యాయని, ఇంకా టిక్కెట్లు అందుబాటులో ఉన్నాయని వెల్లడిస్తున్నారు.

### అవసరమైతే మరిన్ని స్పెషల్ బస్సులు:

**ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిళా అశోక**



పెద్ద పండుగ సందర్భంగా జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ఆర్టీసీ స్పెషల్ బస్సులు నడుపుతున్నాం అని ఆర్టీసీ జిల్లా అధికారిణి షర్మిళా అశోక తెలిపారు. స్పెషల్ సర్వీసుల్లోనూ సాధారణ చార్జీలే వసూలు చేస్తామన్నారు. గత ఏడాది కంటే ఈ సంవత్సరం అదనంగా స్పెషల్ సర్వీసులు పెంచామన్నారు. పండగ ముందు 68 స్పెషల్స్ ఒక్క హైదరాబాద్‌కు పంపుతున్నామని తెలిపారు. పండుగ తర్వాత మరిన్ని స్పెషల్స్ ఉంటాయన్నారు. ప్రయాణికుల డిమాండ్‌ను బట్టి స్పెషల్ సర్వీసులు మరిన్ని నడిపేందుకు చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

# దేశ ప్రగతికి మత్స్య సంపద దోహదం

**కేంద్ర మత్స్య, పశు సంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల**




మినీ ఫిషింగ్ హార్బరులో మాట్లాడుతున్న కేంద్ర మంత్రి పురుషోత్తం

అంతర్వేది, జనవరి 3: మత్స్య సంపద దేశ ప్రగతికి దోహద పడుతుందని కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల అన్నారు. సఖినేటిపల్లి మండలం అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బరులో ఏర్పాటు చేసిన సాగర్ పరిక్రమ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మత్స్యకారుల కోసం ఉభయ గోదావరి జిల్లాలు, కోనసీమ జిల్లాలో స్వచ్ఛందంగా మత్స్యకారులను కలుస్తానని తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధికి, వారి ఆర్థిక పరిస్థితి మెరుగు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. మోదీ హయాంలోనే కేంద్రంలో మత్స్యశాఖను గుర్తించి మంత్రి పదవితో పాటు మత్స్యకార అభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. సాగర్ పరిక్రమ కార్యక్రమంలో 382 కేసీసీ కార్డులు పంపిణీ చేసినట్టు తెలిపారు. సుమారు కోటి 16 లక్షల మత్స్యకారులు లబ్ధి పొందారన్నారు. మత్స్యకార, ట్రేడర్ అసోసియేషన్ వంటి మత్స్యకార విభాగాలపై కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. దీనిలో భాగంగా రూ.20 లక్షలతో మోటూరి సూర్యకిరణ్‌కు ట్రేడర్ వెహికల్ సబ్సిడీతో అందించారు. రూ.32 కోట్లతో మినీ హార్బరు నిర్మించి తీర ప్రాంత మత్స్యకారులకు ఉపాధి కల్పనతో పాటు మత్స్యసంపద వివిధ దేశాలకు తరలి వెళుతుందన్నారు. సమావేశం అనంతరం పలువురు వినతిపత్రాలు అందించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నుపూర్‌అజయ్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ఫిషరీస్ జాయింట్ సెక్రటరీ నీతూకుమారిప్రసాద్, ఎన్ఎఫ్‌డీబీ సీఈవో ఎల్ఎం మూర్తి, ఆర్డీవో కేశవర్ధనరెడ్డి, ఫిషరీష్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జేడీ ఆనందరావు, ఏడీ వర్ధన్, ఎఫ్‌డీవో వెంకటరమణ, సీఐ గోవిందరాజు, ఎస్ఐ ఎస్.రాము పాల్గొన్నారు.

### ఆలయంలో కేంద్ర మంత్రి పురుషోత్తం పూజలు

అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మత్స్య, పశుసంవర్ధకశాఖ కేంద్ర మంత్రి రూపాల పురుషోత్తం బుధవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్వామి వారి అంతరాలయంలో దర్శనం అనంతరం వేద పండితుల ఆశీర్వచనం పొందారు. అనంతరం ఆలయ ఏసీ వి.సత్యనారాయణ కేంద్ర మంత్రికి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ నీతూకుమారిప్రసాద్, ఓఎస్డీ తివారీ, ధార్మిక పరిషత్ మెంబర్ విశ్వనాథరాజు, ఆర్డీవో జి.కేశవవర్ధనరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని మహిళ మృతి



తుని రూరల్, జనవరి 3: 10వ నెంబరు జాతీయ రహదారిని ఆనుకుని తేటగుంట శివారు రాజుల కొత్తూరులో ఓ మహిళ అపస్మారక స్థితిలో ఉండటం గమనించిన స్థానికులు వీఆర్వో, పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్య చికిత్సలు అందజేశారు. అయితే చికిత్స పొందుతూ ఆమె మృతి చెందినట్టు ఎస్ఐ విజయ్‌బాబు తెలిపారు. మృతురాలి వివరాలు తెలియరాలేదని, సంబంధించిన వారు ఉంటే తుని రూరల్ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

### గుర్తు తెలియని రైలు ఢీకొని వృద్ధురాలి మృతి



తుని రైల్వేస్టేషన్ పరిధిలో రైలు ఢీ కొని వృద్ధురాలు మృతి చెందింది. గొల్లపోలు రైల్వేస్టేషన్ సమీపంలో సుమారు 50 ఏళ్ల వృద్ధురాలు పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొని తీవ్ర గాయాలతో పడి ఉంది. దీంతో రైల్వేస్టాఫ్ కాకినాడ జీజీహెచ్‌కు తరలించి వైద్య చికిత్స అందించారు. చికిత్స పొందుతూ వృద్ధురాలు మరణించినట్టు తుని రైల్వే ఎస్ఐ షేక్ అబ్దుల్ మారుఫ్ తెలిపారు. వివరాలు తెలియరాలేదని, ఆమెకు సంబంధించిన వారు తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

# జనం లేక జగన్ సభ వెలవెల

**కాకినాడలో సీఎం జగన్ సామాజిక పింఛన్ల పెంపు సభ**

**సీఎం ప్రసంగం సమయంలోనే వెళ్లిపోయిన జనం**



సభ నుంచి వెనక్కి వెళ్లిపోతున్న జనం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి): కాకినాడలో బుధవారం సీఎం జగన్ సభ జనం లేక వెలవెల బోయింది. సభకు వచ్చినవారంతా మధ్యలోనే వెళ్లిపోవడంతో వైసీపీకి పెద్ద షాక్ తగిలింది. ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో జనాన్ని తరలించినా సామాజిక పింఛన్ల పెంపు సభా ప్రాంగణానికి బస్సులు, ఆటోల్లో కాకినాడ రంగరాయ మెడికల్ కాలేజీ మైదానానికి అధికారులు తరలించారు. ఉదయం 6 గంటలకే జనాన్ని లోపల కూర్చోబెట్టారు. తీరా మధ్యాహ్నం 12గంటలకు సీఎం జగన్ సభకు వచ్చారు. రూ.3 వేల సామాజిక పింఛన్లకు సంబంధించి రూ.1,968 కోట్ల నిధులను విడుదల చేసిన తర్వాత 12.30కు జగన్ ప్రసంగించారు. ఈ సమయంలో ఒక్కసారిగా అందరూ లేచి వెళ్లిపోయారు. పోలీసులు, అధికారులు అడ్డంగా నిలబడి జనాలను నిలువరించే ప్రయత్నం చేశారు. కానీ ఎవరూ ఆగలేదు. నెట్టుకుంటూ బయటకు వెళ్లిపోయారు. కొందరైతే బారికేడ్లు దూకేసి జంపయిపోయారు. జనం వెళ్లిపోవడంతో కంగుతిన్న కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి తన మనుషులతో వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. బయటకు వెళ్లేదారులను మూసేశారు. అయినా ఎవరూ వినిపించుకోలేదు. దీంతో సీఎం జగన్ ఒకపక్క ప్రసంగిస్తుండగానే సభలో కుర్చీలన్నీ ఖాళీ అయిపోయాయి.

# నేటి నుంచి గైట్‌లో చతుర్వేద మహాయాగం

**అంతర్జాతీయ తెలుగు మహాసభలకు ఏర్పాట్లు పూర్తి**



సిద్ధమవుతున్న వేదిక

రాజానగరం, జనవరి 3: లోక కల్యాణం, విశ్వశాంతి కోరుతూ తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)ఆధ్వర్యంలో గైట్ కళాశాల ప్రాంగణంలో గురువారం నుంచి చతుర్వేద మహాయాగం ప్రారంభమవుతున్నట్టు చైతన్య విద్యాసంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు(చైతన్యరాజు) బుధవారం తెలిపారు. 4వ నుంచి 8వ తేదీ వరకు వేద మంత్రోచ్చరణతో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. చతుర్వేదాల్లోని విజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు సైతం అందించాలనేదే యాగం ముఖ్యోద్దేశమన్నారు. యాగశాల ప్రాంగణంలోనే గోశాలతో పాటు మన రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయ నమూనా ఆలయాలు, ఉత్సవ విగ్రహాలు ఏర్పాటు చేసి ఆయా దేవస్థానాల అర్చకులు, వేద పండితులతో ఆశీర్వచనం, ప్రసాదాల వితరణ ఉంటుందన్నారు.

### నిత్య పూజలు...

శ్రీవారి వైభవోత్సవంలో భాగంగా నేటి నుంచి తిరుపతిలో నిత్యం జరిగే మాదిరిగా ఐదు రోజులపాటు స్వామివారికి సుప్రభాత సేవ, తోమాల సేవ, కొలువు, సహస్రనామార్చన, పంచాంగం శ్రవణం, నివేదనం, శుక్రవారాభిషేకం, తిరుప్పావ సేవ, శ్రీవారి కల్యాణోత్సవం, గురుడసేవ, ఏకాంతసేవ, నివేదన కైంకర్యాలను వేద పండితులు నిర్వహించనున్నారు.

### రేపటి నుంచి అంతర్జాతీయ తెలుగు మహాసభలు

చైతన్య విద్యాసంస్థలు, ఆంధ్ర సారస్వత పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో గైట్ ప్రాంగణంలో ఈ నెల 5వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అంతర్జాతీయ తెలుగు మహా సభల నిర్వహణకు ఏర్పాట్లు దాదాపు పూర్తయినట్టు చైతన్యరాజు తెలిపారు. శ్రీరాజరాజ నరేంద్రుడి పట్టాభిషేక సహస్రాబ్ది ఉత్సవాలు నీరాజనంగా నన్నయ భట్టారకుని మహా భారతం వెయ్యేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జరిగే మహాసభలకు గైట్ ప్రాంగణంలో మూడు వేదికలు సిద్ధం చేశామన్నారు. ఐదు రాష్ట్రాలకు సంబంధించిన గవర్నర్లు, కేంద్ర మంత్రులు, పలువురు న్యాయమూర్తులు, సినీరంగ ప్రముఖులు హాజరవుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చైతన్యరాజు పిలుపునిచ్చారు.

# పవన్ పర్యటన వాయిదా

కాకినాడ సిటీ, జనవరి 3: ఈ నెల 4, 5 తేదీల్లో జరగాల్సిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ కాకినాడ పర్యటన వాయిదా పడింది. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నియోజకవర్గ సమీక్షల నేపథ్యంలో ఇక్కడి మలి విడత పర్యటన వాయిదా పడినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇటీవల మూడురోజులు పవన్‌కల్యాణ్ కాకినాడలో బస చేసి పార్టీ నాయకులతో సమీక్షలు జరిపారు. ఆ సమయంలోనే 4, 5 తేదీల్లో కాకినాడలో పర్యటిస్తారని ప్రచారం జరిగింది. తదుపరి ఎప్పుడు పవన్ పర్యటన ఉంటుందనేది టూర్ ఖరారైన తర్వాత వెల్లడిస్తామని పార్టీ వర్గాలు వెల్లడించాయి.

# అన్నదాన భవన నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం



విరాళం అందిస్తున్న శివరామసుబ్రహ్మణ్యం

ఆత్రేయపురం, జనవరి 3: కోనసీమ తిరుమల వాడపల్లిలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి వాడపల్లి శ్రీ వేంకటేశ్వర వాసవి నిత్యాన్నదాన ట్రస్టు తరపున చైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణం రూ.10 లక్షలు విరాళాన్ని బుధవారం సమర్పించారు. స్వామివారిని దర్శించుకుని వేద ఆశీర్వచనం అందుకున్నారు. ఆయనకు ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈవో ముదునూరి సత్యనారాయణరాజు స్వామివారి చిత్రపటం అందజేశారు.

# నిలకడగా విద్యార్థుల ఆరోగ్యం

చింతూరు, జనవరి 3 : ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థినుల్లో ఇంకా 38 మంది ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నారు. చింతూరు మండలం, బొడ్డుగూడెం ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 43 మంది విద్యార్థినులు మంగళవారం ఫుడ్ పాయిజన్‌కు గురైన విషయం విదితమే. దీంతో వారందరికి చికిత్స అందించే క్రమంలో చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారిలో కోలుకున్న ఐదుగురు విద్యార్థులను బుధవారం డిశ్చార్జి చేశారు. ఇంకా 38 మంది విద్యార్థినులు ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు. వారిలో మరో ఐదుగురుని కూడా డిశ్చార్జి చేస్తామని, మిగిలిన వారి పరిస్థితి నిలకడగా ఉందని, ఆందోళన అవసరం లేదని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డా.పుల్లయ్య ఆంధ్రజ్యోతికి తెలిపారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి పరిస్థితి ఎప్పటికపుడు సమీక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. కూరగా వండిన చికెన్ లేదా, సరిగా ఉడకని అన్నం కారణంగా ఈ సమస్య తలెత్తి ఉండవచ్చన్న ప్రాథమిక అభిప్రాయానికి వైద్యులు వచ్చినట్లు డా.పుల్లయ్య పేర్కొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఇ.జాన్‌రాజు బుధవారం ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించారు. ఇటువంటి సంఘటనలు పునరావృత్తం కాకూడదని ఆయన అక్కడి ఉపాధ్యాయులను హెచ్చరించారు.

# వేధింపులకు రాలిన విద్యా కుసుమం

**గడ్డి మందు తాగి చికిత్స పొందుతూ విద్యార్థి మృతి**



పెదపూడి, జనవరి 3: ఉన్నత చదువులు చదివి అత్యున్నత శిఖరాలకు చేరి తన కుటుంబానికి అండగా నిలుస్తాడనుకున్న విద్యా కుసుమం అంతలోనే నేలరాలింది. నూరేళ్ల బంగారు భవిష్యత్ వేధింపుల కారణంగా అర్ధాంతరంగా ముగిసింది. పెదపూడి మండలం అచ్యుతాపురత్రయానికి చెందిన వప్పు పోసి మణికంఠ (19) మృత్యువుతో పోరాడి మృతిచెందాడు. ఈ విషాద ఘటనకు సంబంధించి మణికంఠ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... మణికంఠ కాకినాడ జిల్లాలోని ఓ ప్రముఖ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఎప్పుడు మాదిరిగానే గత నెల 27న కళాశాల బస్సులో కళాశాలకు వెళ్లాడు. వేధింపులే నిత్యకృత్యంగా మారిన కళాశాల హెచ్‌ఓడీ, మరో ఇద్దరు లెక్చరర్లు మణికంఠను చొక్కాకు బటన్స్ సరిగా పెట్టలేదన్న నెపంతో దూషించారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన మణికంఠ చనిపోవాలని అదేరోజు సాయంత్రం సుమారు 6.15 నిమిషాల సమయంలో మాధవపట్నం సమీపంలోని ఇన్‌కంట్యాక్స్ కాలనీ వద్ద గడ్డిమందు తాగి తన కుటుంబ సభ్యులకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. ఆగమేఘాలమీద కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకుని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి మెరుగైన చికిత్సకు ప్రైవేటు హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. పరిస్థితి విషమించడంతో బుధవారం మణికంఠ తుదిశ్వాస విడిచాడు. తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ తెలిపారు. మణికంఠ మరణవార్త తెలియడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ ఇంతలోనే అనంతలోకాలకు వెళ్లిపోయాడని మృతుని తల్లి, తోబుట్టువులు విలపిస్తున్న తీరు అందరిని కలచివేసింది.

# ఐటీడీఏ కార్యాలయం ముట్టడి



ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్వాడీలు

చింతూరు, జనవరి 3: జగన్ ప్రభుత్వంపై అంగన్వాడీలు మండిపడ్డారు. గత ఇరవై రెండు రోజులుగా తాము సమ్మె చేస్తున్నప్పటికి ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినెట్లు వ్యవహరిస్తోందని వారు వాపోయారు. తమతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్న ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో మాత్రం మొండి చేయి చూపుతోందన్నారు. బుధవారం చింతూరు ఐటీడీఏను అంగన్‌వాడీలు ముట్టుడించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో తమ సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. విధుల్లో చేరకపోతే తొలగిస్తామని ప్రభుత్వం బెదిరింపు చర్యలకు దిగడం హేయనీయమన్నారు. ప్రభుత్వం బెదిరింపులకు తాము భయపడేది లేదని అన్నారు. ప్రభుత్వంతో తాడో పేడో తేల్చుకుంటామన్నారు. తమకు నెలకు జీతం రూ.26 వేలు, ఇతర అలవెన్సులు చెల్లించే వరకు తమ నిరసన, సమ్మె కొనసాగుతుందన్నారు. చివరిగా తమ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏలో అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు జయ, చిట్టెమ్మ, కిట్టమ్మ, నూకరత్నం, వెంకటరమణ, సత్యవతి, కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

# హోంమంత్రిని కలిసిన ఐజీ



హోం మంత్రికి ఐజీ అశోక్‌కుమార్ శుభాకాంక్షలు

కొవ్వూరు, జనవరి 3: హోం మంత్రి తానేటి వనితను ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు రేంజ్ డీఐజీగా పనిచేస్తూ ఐజీగా పదోన్నతి పొందిన అశోక్‌కుమార్ బుధవారం కొవ్వూరులోని క్యాంపు కార్యాలయంలో హోం మంత్రిని కలిశారు. పుష్పగుచ్చం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఐజీ వెంట జిల్లా ఎస్పీ జగదీష్ ఉన్నారు.

# అయోధ్యకు రత్నగిరి మట్టి, నీరు

**అన్నవరం నమూనాలయానికి వచ్చిన అయోధ్య రామరథం**



సీతారాముల రథానికి స్వాగతం పలుకుతున్న దేవస్థానం అధికారులు

అన్నవరం, జనవరి 3: ఈనెలలో ఆయోధ్య రామాలయ ప్రారంభం వేడుకలలో సత్యదేవుడు కొలువుదీరిన రత్నగిరి మట్టిని, పవిత్ర పంపానీటిని దేవస్థానం అధికారులు అందజేశారు. మంగళవారం రాత్రి 12 గంటలకు జాతీయ రహదారిపై నమూనాలయానికి చేరుకున్న అయోధ్య రామ రథానికి దేవస్థానం పీఆర్వో దామెర కృష్ణారావు, పండితులు ఘన స్వాగతం పలికారు. రాజస్థాన్‌లో బికనూరు నుంచి డిసెంబరు 18న రామరథం బయలుదేరిందని, ఈనెల 22 నాటికి అయోధ్య రామ మందిరానికి చేరుతుందన్నారు. రాష్ట్రంలో అన్నవరం, విజయవాడ దేవస్థానాల నుంచి నీరు, మట్టిని తీసుకెళుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.



# చెట్టును ఢీకొన్న మోటార్ బైక్

**సర్వేయర్ మృతి, మరో సర్వేయర్‌కు తీవ్ర గాయాలు**



మురళీ మృతదేహం

ప్రత్తిపాడు, జనవరి 3: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామం వద్ద బుధవారం రాత్రి మోటార్‌బైక్ చెట్టును ఢీకొన్న దుర్ఘటనలో ఒక యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఏలేశ్వరం మండలం సర్వేయర్లుగా పని చేస్తున్న ఏలేశ్వరానికి చెందిన మురళి, సిరిపురం గ్రామానికి చెందిన స్వామిసతీష్ బుధవారం రాత్రి పెద్దిపాలెంలో ఒక శుభకార్యానికి హాజరై తిరిగి మోటార్‌బైక్‌పై వస్తుండగా లంపకలోవ గ్రామం వద్ద వారు నడుపుతున్న బైక్ చెట్టును ఢీకొంది. ఈ దుర్ఘటనలో మురళీ (26) అక్కడికక్కడే మృతి చెందగా స్వామి సతీష్ తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి 108 వాహనంలో తరలించారు. ఇద్దరు యువకులు సర్వేయరుగా పని చేస్తూ ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందడం, మరొకరు తీవ్రంగా గాయపడంతో పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

# చెత్త డంపింగ్ సమస్యను పరిష్కరించలేని మంత్రి, ఎమ్మెల్యే

**సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లిన నాగాబత్తుల శాంతకుమారి**



మాట్లాడుతున్న సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు శాంతకుమారి

అంబాజీపేట, జనవరి 3: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 20 వేలు పైబడి ఉన్న మాచవరం మేజర్ పంచాయతీలో ఏడాది కాలంగా చెత్త డంపింగ్ సమస్య ఉన్నప్పటికీ తమ ప్రాంతంలో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షురాలు నాగాబత్తుల శాంతకుమారి ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సమక్షంలో జరిగిన రాష్ట్రస్థాయి సర్పంచ్‌ల సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఏపీ పంచాయతీరాజ్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో శాంతకుమారి పాల్గొని మాచవరంలో నెలకొన్న చెత్త డంపింగ్ సమస్యను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాలుగా ఉండి గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించలేని దుస్థితిలో సర్పంచ్‌లు ఉన్నారన్నారు. ఈ సదస్సులో పలు సమస్యలను చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లినట్లు శాంతకుమారి ఆంధ్రజ్యోతికి తెలిపారు.

## ఏజెన్సీ సమాచారం

### సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి

**ఐటీడీఏ పీవో సూరజ్‌గనోరే**



మాట్లాడుతున్న సూరజ్‌గనోరే

రంపచోడవరం, జనవరి 3: నియోజకవర్గ పరిధిలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి నివేదికలు సమర్పించాలని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి అన్ని మండలాల తహశీల్దార్లు, విద్యాశాఖాధికారులతో సమస్యాత్మక పోలింగ్ స్టేషన్లు గుర్తించుట, సెక్టారు అధికారులతో సమావేశం ఏర్పాటు, కొండరెడ్లకు నివాస స్థలాల ఏర్పాటు, రేషన్ కార్డు లబ్ధిదారులకు సరుకుల పంపిణీ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఫారం 6, 7, 8లలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. గృహాలు లేని కొండరెడ్లకు హౌసింగ్, సచివాలయ సిబ్బందితో సర్వే జరిపి నివేదికలు అందజేయాలన్నారు. తహశీల్దార్లు పీవీవీ జయకుమార్, కె.శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారి ఎంవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

### పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రంపచోడవరం, జనవరి 3: మండలంలోని కొయ్యలగూడెం, లంకపాకలు పోలింగ్ కేంద్రాలను బుధవారం సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు, బూత్ స్థాయి అధికారుల పనిచేస్తున్న తీరును పరిశీలించారు. ఆయన వెంట డీటీ ఎన్‌వీవీ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ టి.లక్ష్మణ్, మణికంఠ ఉన్నారు.

### హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలి

ఎటపాక, జనవరి 3: నవోదయలో 6వ తరగతి ప్రవేశం కోసం అప్లై చేసుకున్న విద్యార్థులు హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని ఎటపాక నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ టి.లక్ష్మీరాజమ్ తెలిపారు. ఈనెల 20న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. www.navodaya.gov.in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.ఎంఈవో కార్యాలయంలో కూడా విద్యార్థులు హాల్ టిక్కెట్లు పొందవచ్చునని చెప్పారు.

### మెరుగైన వైద్యం అందించాలి

చింతూరు, జనవరి 3: ఫుడ్ పాయిజన్‌కు గురైన ఆశ్రమ పాఠశాల విద్యార్థినులకు మెరుగైన చికిత్స అందించాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఇళ్ళ చిన్నారెడ్డి, జనసేన మండల అధ్యక్షుడు మడివిరాజు కోరారు. బొడ్డుగూడెం ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న 43 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌తో అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. వారందరికి చికిత్స అందించే క్రమంలో చింతూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న టీడీపీ, జనసేన పార్టీల నాయకులు బుధవారం ఏరియా ఆసుపత్రికి వెళ్లి విద్యార్థులను పరామర్శించారు. కార్యక్రమంలో తుర్రం చిన్నముత్తయ్య, శీలం తమ్మయ్య, తీగల రవి, కన్నారావు, సవలం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### శ్రీరాముని అక్షింతలు పంపిణీ



బ్యాంకు సిబ్బందికి అక్షింతలు పంపిణీ చేసిన దృశ్యం

మోతుగూడెం, జనవరి 3: చింతూరు మండలం మోతుగూడెంలో అయోధ్య నుంచి తీసుకువచ్చిన అక్షింతలను బుధవారం పంపిణీ చేశారు. మోతుగూడెంలోని యూనియన్ బ్యాంక్‌లో బుధవారం బ్యాంక్ మేనేజర్ వి.సత్యనారాయణ, అసిస్టెంట్ మేనేజర్ కె.శివకుమార్, క్యాషియర్ సీహెచ్ రాజేష్, అటెండర్ స్వామికి అయోధ్య నుంచి వచ్చిన రాముల వారి అక్షింతలను సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు భగవాన్, వెంకటేశ్వరరావు అందించారు. మోతుగూడెంలోను ఈ అక్షింతలను పంపిణీ చేశారు.

### విద్యార్థుల అన్న సమారాధన ఉత్సవం

వై.రామవరం, జనవరి 3: వై.రామవరం మండలం పి.ఎర్రగొండ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో శనివారం విద్యార్థులు అన్న సమారాధన మహోత్సవాన్ని జరుపుకున్నారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ శ్రీపాదరామ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీపీ ఆనందరావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ విశ్వమ్మ, ఎంపీటీసీ శుభ లక్ష్మి పాల్గొన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

### వణికిస్తున్న పొగ మంచు



ఆహ్లాదకరంగా కనిపిస్తున్న పరిసరాలు

మోతుగూడెం, జనవరి 3: చింతూరు మండలం మోతుగూడెం ఏజెన్సీలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నప్పటికీ చలి తీవ్రత పొగ మంచు కొనసాగుతోంది. ఏజెన్సీలో మోతుగూడెం, డొంకరాయిలో బుధవారం కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మన్యంలో తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకు దట్టంగా పొగ మంచు కురుస్తోంది. ఏజెన్సీలో రోడ్లు స్పష్టంగా కనిపించకపోవడంతో హెడ్‌లైట్లు వేసుకుని వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. సాయంత్రం 3 గంటల తర్వాత చలి ప్రభావం మొదలవుతోంది. దీంతో ఏజెన్సీ వాసులు ఎక్కువగా చలి మంటలు వద్ద గడుపుతున్నారు.



మోతుగూడెం పరిసరాల్లో మంచు దుప్పటి

### అయోధ్య రాముని అక్షింతలు పంపిణీ

కడియం, జనవరి 3: అయోధ్య నుంచి వచ్చిన యజ్ఞ అక్షింతల పంపిణీ కార్యక్రమం బుధవారం జరిగింది. హిందూ ధర్మ ప్రచారసమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామంలో అన్ని దేవాలయాల కమిటీలు, భజనమండలులు, సత్సంగ కమిటీలు, ధార్మికసంస్థలు పాల్గొన్నాయి. ప్రతి ఇంటికి అక్షింతలను అందించారు. ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్ ప్రారంభించిన ఈ కార్యక్రమానికి విఘ్నేశ్వర తాపీ పని కార్మిక సంఘం, దొడ్డాబుజ్జి మిత్రబృందం సహకరించింది.

# రెగ్యులర్ చేయాలి

**సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సమగ్రశిక్ష ఉద్యోగుల ధర్నా**



సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 3: సమగ్ర శిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులు అందరినీ విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట సమగ్రశిక్ష ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. పుష్కరఘాట్‌లో గోదావరిలోకి దిగి జలదీక్ష చేసి నిరసన వ్యక్తం చేశారు. సమగ్రశిక్ష కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జరిగిన ధర్నాలో జేఏసీ నాయకులు ఎం.రఘునాథ్, డి.వంశీకృష్ణంరాజు, దుర్గాప్రసాద్, వెంకట్రాజు, మిరపరాజు, వెంకట్ మాట్లాడుతూ ప్రస్తుతమున్న పార్ట్‌టైం విధాన్ని రద్దు చేసి ఫుల్‌టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవుట్‌సోర్సింగ్ సిబ్బందిని కాంట్రాక్టు విధానంలోకి తీసుకురావాలని, వేతనాలు పెంచి ప్రతి నెలా 1వ తేదీనే విడుదల చేయాలని కోరారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ధర్నాలో సమగ్రశిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు. యూటీఎఫ్ నాయకులు ధర్నా వద్దకు వచ్చి సంఘీభావం తెలిపారు.

### ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరికాదు: ఎమ్మెల్సీ ఐవీ

**సమగ్ర శిక్షా ఉద్యోగుల జలదీక్ష**



రాజమహేంద్రవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్షా ఉద్యోగులను ఇబ్బంది పెట్టడం సరైన పద్ధతి కాదని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె శిబిరం వద్దకు బుధవారం ఆయన చేరుకొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయడంతోపాటు రెగ్యులర్ చేయాలన్నారు. వేతనాలు పెంచడంతోపాటు ప్రతి నెలా ఒకటో తేదీన ఇవ్వాలన్నారు. కాగా.. సమ్మె 15వ రోజు సందర్భంగా సమగ్ర శిక్షా ఉద్యోగులు పుష్కరఘాట్ ధర్నా నిర్వహించి జలదీక్ష చేసి నిరసన తెలిపారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. జేఏసీ, యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

# రానున్న ఎన్నికలకు స్ట్రాంగ్‌రూమ్ పరిశీలన



స్ట్రాంగ్ రూమ్ పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితర అధికారులు

దివాన్‌చెరువు, జనవరి 3: రానున్న సాధారణ ఎన్నికల సందర్భంగా జిల్లా పరిధిలోని రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి లెక్కింపు కేంద్రం, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను నన్నయ విశ్వవిద్యాలయంలో సంబంధిత అధికారులతో కలసి ముందస్తుగా పరిశీలించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత తెలిపారు. బుధవారం నన్నయ విశ్వవిద్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ పి.జగదీష్, ఇతర అధికారులతో కలసి కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల గదుల కేటాయింపు, ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, అక్కడి నుంచి కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్, భద్రత తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని మ్యాప్‌ను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల మార్గదర్శకాల మేరకు మూడు అంచెల భద్రత తదితర అంశాలపై కూలంకషంగా క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్, కొవ్వూరు సబ్‌కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ్, డీఆర్వో నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

### చీకటైతే ఆకతాయిలతో హడల్

**ఎంపీ భరత్‌రామ్‌కు మహిళల ఫిర్యాదు**

రాజమహేంద్రవరం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): నగరంలో శాంతిభద్రతలు శాంతంగా లేవనడానికి ఇదే నిదర్శనం. చీకటిపడితే ఆకతాయిలు రెచ్చిపోతున్నారని ఎంపీ భరత్‌రామ్‌కు మహిళలు ఫిర్యాదు చేశారు. స్థానిక తొమ్మిదో వార్డులోని ఓ పార్కు ప్రారంభోత్సవానికి భరత్ ఉత్సాహంగా వెళ్లారు. అయితే, అక్కడకు చేరుకున్న మహిళలు ఎంపీకి తమ గోడు విన్నవించారు. చీకటి పడితే ఆకతాయిల బెడద ఎక్కువగా ఉందని.. వీధి లైట్లు పగలగొడుతున్నారని చెప్పారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని.. మందు తాగుతూ రెచ్చిపోతున్నారన్నారు. రాజమండ్రిలో భద్రత ఇంత దారుణంగా ఉందని ఆక్షేపించారు. దీంతో ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని అక్కడే ఉన్న పోలీసులకు ఎంపీ హుకుం జారీ చేశారు. కానీ సీసీ కెమెరాలు, పోలీసుల గస్తీ గురించి ఆయన ఆరా తీయకపోవడం గమనార్హం.

### ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 3: దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే అని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డి.పరంజ్యోతి, రాష్ట్ర కోఆర్డినేటర్ గుమ్మపు చిత్రసేనలు అన్నారు. రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ్‌కుమార్, ఇన్‌చార్జి పరమట గణేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా విచ్చేసి ఆమె చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు. మహిళా విద్యాభివృద్ధికి సావిత్రిబాయి చేసిన కృషిని వివరించారు. కార్యక్రమంలో గెడ్డం ప్రసాద్, కొండపల్లి సూరిబాబు, పి.రవి, చిన్నబాబు పాల్గొన్నారు. స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్కే పూలమాలతో నివాళులర్పించారు. మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ బి.భవాని మాట్లాడుతూ సావిత్రిబాయి.. భర్త జ్యోతిబాపూలే సహకారంతో నవసమాజ నిర్మాణానికి చేసిన కృషిని తెలిపారు.

# ఒక్కచాన్స్‌తో రాష్ట్రం సర్వనాశనం

**భవిష్యత్తుకు గ్యారెంటీలో టీడీపీ నేత ఆదిరెడ్డి, జనసేననేత అనుశ్రీ**



రాజమహేంద్రవరం సిటీ, జనవరి 3: ఒక్కచాన్స్ ఇచ్చినందుకు రాష్ట్రాన్ని జగన్ సర్వనాశనం చేశాడని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన అర్బన్ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ మండిపడ్డారు. రాజమహేంద్రవరంలోని కోటగుమ్మం సెంటర్‌లో బుధవారం టీడీపీ-జనసేన కూటమి ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను చెప్పడంతోపాటు మినీ మేనిఫెస్టోలోని పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెయిన్ రోడ్డులో అనాలోచిత పనుల వల్ల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిపాలన గాడి తప్పిందని, టీడీపీ జనసేన కూటమి ఆధ్వర్యంలో ప్రజలందరికి మంచి పాలన అందిస్తామన్నారు. రాబోయేఎన్నికల్లో ప్రజలు విజ్ఞతతో ఓటు హక్కు వినియోగించుకుని వైసీపీకి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కాశి నవీన్‌కుమార్, దొండపాటి సత్యంబాబు, వై.శ్రీను పాల్గొన్నారు.

### 'ఎన్నికలకు సిద్ధం కండి'

కోరుకొండ, జనవరి 3: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం ద్వారా రానున్న సార్వత్రిక ఎన్నికలకు సిద్ధం కావాలని వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పిలుపునిచ్చారు. బుధవారం కోరుకొండలో హరేరామ సమాజం ప్రాంగణంలో వైసీపీ అనుబంధ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. అనంతతరం స్థానిక పార్టీ కార్యాలయంలో డివిజన్ల వారీగా ముఖ్య నేతలతో సమావేశమై పలు సూచనలు చేశారు. ఇదిలా ఉండగా కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామికి ఎమ్మెల్యే జక్కంపూడి తలనీలాలు సమర్పించుకుని ఆలయంలో రానున్న సార్వత్రిక ఎన్నికలకు శంఖారావం చేశారు. కార్యక్రమాల్లో జక్కంపూడి విజయలక్ష్మి, ఎమ్మెల్యే సతీమణి రాజేశ్వరి, జడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కడియాల పాపారావు, అడపా కనకరాజు, బొరుసు బద్రినారాయణ పాల్గొన్నారు.

### విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



కడియం, జనవరి 3: వేమగిరితోట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ జరిగింది. ప్రభుత్వం మంజూరు చేసిన ఈ ట్యాబ్‌లను సొసైటీ డైరెక్టర్ కట్టా జమీందారు, వైసీపీ నాయకులు గుబ్బల నాగార్జున, పితాని హరికృష్ణ విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### క్రీడాకారులకు దుస్తుల పంపిణీ

అనపర్తి, జనవరి 3: అనపర్తిలోని జడ్పీ హైస్కూల్లో క్రీడాకారులకు బుధవారం క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. వాలీబాల్ క్రీడాకారుడు, మాజీ ఎంపీపీ కర్రి లక్ష్మీనారాయణరెడ్డి(లచ్చారెడ్డి) మిత్ర బృందం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ లచ్చారెడ్డి.. విద్యాభ్యాసం ముగిసినప్పటికీ రాష్ట్రంలో ఎక్కడ వాలీబాల్ పోటీలు జరిగినా పాల్గొని విజయాలు నమోదు చేస్తూ అనపర్తికి పేరు ప్రఖ్యాతులను తీసుకొచ్చారన్నారు. ముందుగా లచ్చారెడ్డి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో తేతలి సూర్యారెడ్డి, సీహెచ్ వెంకటరెడ్డి, మల్లిడి రామారెడ్డి, కర్రి జగన్నాథరెడ్డి, సత్తి పోతారెడ్డి, మల్లిడి శ్రీనివాసరెడ్డి(లెఫ్ట్), నల్లమిల్లి గోవిందరెడ్డి పాల్గొన్నారు.

### సంస్కృతిని పరిరక్షించుకోవాలి

అనపర్తి, జనవరి 3: ఆధునిక యుగంలో విష సంస్కృతి, వింత పోకడలతో కనుమరుగవుతున్న భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని హైదరాబాద్‌కు చెందిన శృంగేరి శారద పీఠ ఆస్థాన పౌరాణికులు బాదంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి అన్నారు. అనపర్తిలోని టీటీడీ కళ్యాణ మండపంలో శారదా సంగీత కళా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా రెండో రోజైన బుధవారం ఆయన శ్రీరామ వైభవంపై ఆధ్యాత్మిక ప్రవచనం చేశారు. కార్యక్రమంలో వ్యాపారవేత్త సత్తి జనార్దనరెడ్డి, డాక్టర్ తేతలి సత్యనారాయణరెడ్డి, ఎస్ఎంఎం బాలకృష్ణారెడ్డి, తమలంపూడి చిన ఆదిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### 5న తోకాడలో పింఛన్ల పంపిణీ

రాజానగరం, జనవరి 3: ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన వైఎస్సార్ పింఛన్లు పంపిణీ, పెంపుపై ఈ నెల 5న రాజానగరం మండలం లోని తోకాడ గ్రామంలో నియోజకవర్గస్థాయి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో ఎం.సుబ్రహ్మణ్యం బుధవారం తెలిపారు. ఆరోజు ఉదయం 9గంటలకు స్థానిక హైస్కూల్లో జరిగే ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని రాజానగరం, సీతానగరం, కోరుకొండ మండలాలకు చెందిన అధికారులు, లబ్ధిదారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకావాలన్నారు.

### టీడీపీలో చేరిన తమ్మన్నదొర

గోకవరం, జనవరి 3: జగ్గంపేట నియోజకవర్గంలో వైసీపీకి షాక్ మీద షాక్ తగులుతుంది. అగ్రనాయకులు ఒక్కొక్కరు ఆ పార్టీని వీడుతున్నారు. తాజాగా వైసీపీ సీనియర్ నాయకుడు, గోకవరం సొసైటీ మాజీ ఛైర్మన్ దాసరి తమ్మన్నదొర, ఆయన మనవడు తరుణ్‌తో పాటు సుమారు 50 కుటుంబాలకు చెందినవారు బుధవారం మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ నెహ్రూ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నెహ్రూ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో యువతకు ఉపాధి కల్పించలేకపోయిందని, అందువల్లే టీడీపీలో చేరుతున్నారని, తెలుగుదేశం అధికారంలోకి వస్తే యువతకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మంగరౌతు రాము, పాలూరి బోస్, కన్నబాబు, అడపా భరత్, ఉంగరాల రాము, మండిగ గంగాధర్, గునుపే భరత్ పాల్గొన్నారు.

### యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా బిల్డర్ బాబి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 3: జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రాజమహేంద్రవరానికి చెందిన బిల్డర్ బాబి నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కరాజు రామారావు నుంచి యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జిలు రక్ష రామయ్య, మమతా నాగిరెడ్డి, జిల్లా ఇన్‌చార్జి కొల్లి రామసూరిరెడ్డి సమక్షంలో నియామకపత్రాన్ని బిల్డర్ బాబి అందుకున్నారు. ఎంపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల వంటివి కాంగ్రెస్‌తోనే సాధ్యమని బాబి అన్నారు.

### 35 మద్యం బాటిళ్లు స్వాధీనం

అనపర్తి, జనవరి 3: అనపర్తి రైల్వేస్టేషన్ ప్రాంగణంలోని సైకిల్ స్టాండ్ వద్ద ఒక వ్యక్తి నుంచి 35 తెలంగాణా మద్యం ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు. బిక్కవోలు మండలం కొంకుదురు గ్రామానికి చెందిన సత్తి వెంకటరెడ్డి అనపర్తి రైల్వేస్టేషన్ సమీపంలో సైకిల్ స్టాండ్ నిర్వహిస్తూ అనపర్తిలో నివాసం ఉంటున్నాడు. తెలంగాణా నుండి మద్యం బాటిళ్లను తీసుకొచ్చి విక్రయిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించగా 35 ఫుల్ బాటిళ్లు బయట పడ్డాయి. వీటి విలువ సుమారు రూ.25 వేలు ఉంటుందన్నారు. దీంతో వెంకటరెడ్డిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

### పేకాడుతున్న ముగ్గురి అరెస్టు


అనపర్తి, జనవరి 3: అనపర్తి శివారు అర్తమూరులో పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్టు ఎస్ఐ జగన్మోహనరావు బుధవారం రాత్రి తెలిపారు. పేకాట జరుగుతుందన్న సమాచారంతో దాడులు నిర్వహించగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారని వీరి నుంచి రూ. 2570 స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

### సారా కేసులో వ్యక్తి అరెస్ట్

రంగంపేట, జనవరి 3: మండలంలోని ఈలకొలను గ్రామంలో ఎస్ఈబీ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. కురికూరి శ్రీనివాస్ వద్ద 12 లీటర్ల సారా ఉండడంతో అరెస్ట్ చేసి పెద్దాపురం కోర్టులో హాజరుపరిచామని ఎస్ఈబి సీఐ జి.వెంకటలక్ష్మి తెలిపారు. దాడుల్లో ఎస్ఈబీ ఎస్ఐ శేఖర్‌బాబు పాల్గొన్నారన్నారు.

### అర్హులందరూ ఓటు హక్కు పొందాలి

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 3: ఓటే ప్రజా ఆయుధమని, అర్హులందరూ ఓటర్లుగా నమోదు కావాలని కమిషనర్ దినేష్‌కుమార్ పిలుపునిచ్చారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా ట్రాన్స్‌జెండర్స్, దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడిన ఓటర్లు సైతం ఓటు హక్కు నమోదు వినియోగించుకొనేలా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ సిబ్బంది అవగాహన కార్యక్రమం చేపట్టారు. జెండా పంజా రోడ్డు వద్ద ట్రాన్స్‌జెండర్లకు, గౌతమి జీవకారుణ్య సమాజంలో వృద్ధులు, ప్రియదర్శిని ఫౌండేషన్ ఆధ్వర్యంలోను అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్ పీఎం సత్యవేణి, ఐఈసీ స్పెషలిస్ట్ జేఎస్ఆర్ అన్నమయ్య పాల్గొన్నారు.



# అక్రమార్కులపై కొరడా!



- అక్రమ ఇసుక తవ్వకాలపై హైకోర్టు ఆగ్రహం
- నాలుగు వారాలలో సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వాలని ఆదేశం
- అయినా.. ఆగని ఇసుక తవ్వకాలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

అక్రమ ఇసుక తవ్వకాలపై హైకోర్టు సీరియస్ అయింది. రాజమహేంద్రవరం అర్బన్, రూరల్ పరిధిలోని ర్యాంపుల నుంచి అఖండ గోదావరిలో డ్రెడ్జింగ్ చేస్తూ అక్రమంగా ఇసుక తవ్వేస్తున్నారని ధవళేశ్వరం పరిధిలోని గాయత్రీ ర్యాంపులకు సంబంధించి ఒకరు హైకోర్టును ఆశ్రయించారు. దీంతో గతంలోనే ఇసుక అక్రమ తవ్వకాలు అన్ని చోట్ల ఆపివేయాలని ఆదేశించింది. కానీ ఆపక పోగా, రాత్రి పగలూ వందలాది డ్రెడ్జింగ్ పడవలతో అఖండ గోదావరిని గుల్ల చేస్తూ కోట్లాది రూపాయల విలువైన ఇసుక వ్యాపారం జరిగిపోతోంది. మే నెలలోనే ఇసుక కాంట్రాక్టర్ గడువు ముగిసినా, కొత్త కాంట్రాక్టు ఎవరికీ ప్రభుత్వం ఇవ్వకపోయినా ఇసుక తవ్వకాలు ఆగలేదు. ఈ వ్యవహారంపై వేసిన కేసు మళ్లీ బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్ తరపు న్యాయవాది నర్రా శ్రీనివాస్.. న్యాయమూర్తి ముందుకు పలు విషయాలు తీసుకుని వెళుతూ, గతంలో గౌరవ హైకోర్టు ఆదేశించినా అక్రమ తవ్వకాలు ఆపలేదని, ప్రస్తుతం కూడా తవ్వేస్తున్నారని, డ్రెడ్జింగ్ కూడా చేస్తున్నారని, ఆధారాలతో చూపించడంతో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్పందించారు. అధికార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై రాజమహేంద్రవరం ఎస్పీకి ఆదేశాలిచ్చి, నాలుగు వారాలలోగా సీల్డ్ కవర్‌లో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఆయన నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు ఉంటాయని కోర్టు స్పష్టంచేసింది. దీంతో గాయత్రీ, కోటిలింగాల, కాతేరు, వెంకటనగర్ తదితర ప్రాంతాలకు చెందిన ర్యాంపుల ద్వారా డ్రెడ్జింగ్ చేస్తున్న వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. మే నెల నుంచి ఇప్పటికూ లక్షల టన్నుల మేర ఇసుక తవ్వేశారు. రూ.వందల కోట్లు అక్రమాలకు పాల్పడ్డారు. ఇందులో కొందరు వెనుక వైసీపీ నేతలు ఉండడం గమనార్హం. ఇంతవరకూ ఆధారాలు లేకుండా ఇసుక తవ్వేయడం వల్ల.. ఇవాళ ఎవరిని బాధ్యులను చేస్తారో చూడాలి. ఇన్ని అక్రమాలు జరుగుతున్నా, అనుమతులు లేకుండా ఇసుక డ్రెడ్జింగ్ చేస్తున్నా చోద్యం చూస్తున్న అధికారులు ఏమి సమాధానం చెబుతారో మరి. అక్రమ ఇసుక వ్యాపారులు, వారికి సహకరించిన ర్యాంపుల నిర్వాహకులు, మౌనం వహించిన అధికారులు కూడా బాధ్యులే అవుతారనే వాదన మొదలైంది. ఇప్పటికైనా ఇసుక దోపిడీ ఆపుతారోలేదో గురువారం నాటికి స్పష్టత ఉంటుంది. దీనిపై నివేదిక ఇవ్వడం కూడా పోలీసులకు సవాలే. ఆధారాలు చూపడానికి ప్రయత్నిస్తే దొంగలెవరో తేలుతుంది. చివరకు దొంగచాటున ఉన్న వ్యాపారి వద్ద నుంచి కేవలం టన్నుకు రూ.150 నుంచి రూ.200 వరకూ తీసుకుంటూ డ్రెడ్జింగ్‌తో భారీగా ఇసుక తవ్విస్తున్నా ర్యాంపుల నిర్వాహకులతోపాటు పట్టించుకోని అధికారులు బలైపోయే ప్రమాదం కూడా ఉంది.





సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట టీచర్ల నిరసన దీక్ష.. మాట్లాడుతున్న కేఎస్ఎస్ ప్రసాద్

## టీచర్లపై రాష్ట్ర ప్రభుత్వం అణచివేత ధోరణి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 3: టీచర్లపై రాష్ట్ర ప్రభుత్వం అణచివేత ధోరణి సాగిస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. రావాల్సిన డీఏలు, ఎరియర్స్ తక్షణమే చెల్లించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. ఎవరైతే సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయడానికి సమ్మతిస్తారో వారికే బాహాటంగా తమ మద్దతు ఉంటుందని స్పష్టంచేశారు. బుధవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో 12 గంటల ఆందోళన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రసాద్ మాట్లాడుతూ 1వ తేదీనే జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం తాత్సారం చేస్తూ టీచర్లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే జనవరి 9, 10 తేదీల్లో విజయవాడలో 36 గంటల భారీ నిరసన కార్యక్రమం చేపడతామని స్పష్టంచేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అంగన్వాడీలు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు, ఉపాధ్యాయులు రోడ్డెక్కి పోరాటాలు చేస్తుంటే సీఎం ఏమీ ఎరగనట్టు తాడేపల్లిలో కూర్చుని ఆడుదాం ఆంధ్ర అనడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. జిల్లా అధ్యక్షుడు జయకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి షరీఫ్, రాష్ట్ర కార్యదర్శి అరుణకుమారి, జిల్లా మహిళా అసోసియేట్ విజయగౌరీ, ఆర్థిక కార్యదర్శి ఈవీవీఎస్ఆర్ ప్రసాద్, కాకినాడ జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు నగేష్‌బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు శంకరుడు మాట్లాడారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

## కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల బైఠాయింపు

రాజమహేంద్రవరం రూరల్ జనవరి3: అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం బెదిరింపుల వైఖరి మానుకోవాలని, జగన్ సర్కార్ శంకరగిరి మాన్యాలు పట్టడం ఖాయమని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. జిల్లా కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీల జిల్లా నలుమూలల నుంచి సుమారు 3 వేల మంది చేరుకొని బైఠాయించి నిరసన తెలిపారు. శిబిరం వద్దకు ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు విచ్చేసి మద్దతు పలికారు. ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్ అంగన్‌వాడీలకు ఇచ్చిన వేతనాల పెంపు హామీని అమలుచేయమని అంగన్‌వాడీలు అడిగితే వేధించడం ఎంతవరకు సబబు అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎం సుందరబాబు, బి రాజులోవ, ఎస్ఎస్ మూర్తి, కేఎస్వీ రామచంద్రరావు, ఎస్ భగవత్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె బేబీరాణి తదితరులు పాల్గొన్నారు. కాగా జిల్లా కలెక్టరేట్ వద్ద చేస్తున్న అంగన్‌వాడీల దీక్షా కార్యక్రమానికి వెళ్లి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి సంఘీభావం తెలిపారు.



ధర్నా చేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మధు, మునిసిపల్ వర్కర్లు

## హోరెత్తిన పారిశుధ్య కార్మికుల ఆందోళన

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 3: మునిసిపల్ పారిశుధ్య కార్మికులు బుధవారం సమ్మెలోకి వెళ్లారు. పర్మినెంట్ చేయాలని లేదా సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్‌చేస్తూ రాజమహేంద్రవరంలో కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించి కార్పొరేషన్ కార్యాలయం మెయిన్ గేట్ వద్ద బైఠాయించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగగా, కార్మికుల సమ్మెకు టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ మద్దతు తెలిపారు. కాగా కార్మికులను కమిషనర్ దినేష్‌కుమార్ కలిసి సమ్మె విరమించాలని కోరారు.



ఇసుక అక్రమాలపై పోలీసులకు వినతిపత్రం ఇస్తున్న వెంకట రమణచౌదరి

## యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న టీడీపీ నాయకులు
- ఆరు గంటలపాటు నిరసన

సీతానగరం, జనవరి3: సీతానగరం మండలం మునికూడలి గ్రామంలోని ఇసుక ర్యాంపు వద్ద అక్రమంగా ఇసుక రవాణా చేయడమే కాకుండా రైతుల అనుమతి లేకుండా పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలు జరపడం పట్ల నిరసన వ్యక్తం చేస్తూ బుధవారం సాయంత్రం టీడీపీ రాజానగరం ఇన్‌చార్జి బొడ్డు వెంకట రమణ చౌదరి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు, రైతులు ఆందోళన చేపట్టారు. ముందుగా ఇసుక లోడింగ్ చేస్తున్న ప్రదేశాలను పరిశీలించి రైతుల పట్టాభూముల్లో తవ్వకాలు జరిగాయని నిర్ధారణ చేసుకున్నారు. డిమార్కిగేషన్, మైనింగ్ శాఖ మార్కింగ్‌లు లేవు. నిబంధనలకు విరుద్ధంగా 15 అడుగుల లోతు వరకు తవ్వేస్తున్నారు. అధిక లోడింగ్‌తో వాహనాలు ద్వారా తరలించుకుపోతున్నారని ఆయన ఆరోపించారు. ప్రతిమ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డిసెంబర్ 22న టెండర్ వేస్తే అప్పటికే డిసెంబర్ 4 నుంచి తవ్వకాలు మొదలుపెట్టారని, ఇదేం పద్ధతని అక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జులను ప్రశ్నించారు. వారు దానికి సమాధానం చెప్పకపోవడంతో అసలు ఇచ్చిన అనుమతులు, మైనింగ్ శాఖ ఇచ్చిన మార్కింగ్‌లు గాని చూపించాలని గ్రామంలో టెంటు వేసుకుని ఆందోళన దిగారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని చర్చలు జరిపారు. రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని రెండు రోజుల్లో పూర్తి పత్రాలన్నీ చూపిస్తామని చెబుతూ డీఎల్ఎస్సీ ద్వారా వచ్చిన ప్రతిపాదనలను చూపారు. రాత్రి పది గంటల వరకు ఆందోళన కొనసాగగా, అనుమతులు చూపించే వరకు తవ్వకాలు జరపమని హామీ ఇవ్వడంతో చివరకు నిరసనను విరమించుకున్నారు.

# పింఛను వంచన!



- అంకెల గారడీతో బురిడీ
- జిల్లాలో 777 పింఛన్ల తీసివేత
- కొత్తవి 3 వేలని అసత్యాలు
- డిసెంబరు 1కి 2,39,191
- జనవరి 1కి 2,38,414
- ట్రాన్స్‌జెండర్లకు కొత్తగా 1
- హెచ్ఐవీ వారివి 40 ఉఫ్
- అందరితోపాటే దివ్యాంగులు
- దివ్యాంగ 3%, వృద్ధాప్య 1%..
- వితంతు పింఛన్లలో 2% పెంపు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

పింఛన్ల లబ్ధిదారుల సంఖ్యలోనూ జగన్ మార్కు వంచన కనబడుతోంది. అబద్ధాల జాఢ్యం పింఛన్లనూ వదల్లేదు. పదికి పది కలిపితే ఇరవై అవుతుంది. కానీ.. పాలకుల గణాంకాలను పరిశీలిస్తే పదే వస్తుంది. అయితే జనాలకు మాత్రం యాభై అని చూపెడుతూ పబ్బం గడిపేస్తున్నారు. 'ఏడాదికి ఏడాది పింఛనుదారుల సంఖ్య పెరుగుతోంది.. లక్షల కోట్ల రూపాయలు ధార పోస్తున్నాం'.. అనే మాటలను అంకెల గారడీ వెక్కిరిస్తోంది. ఎప్పటికప్పుడు లబ్ధిదారుల్లో కోత విధించి.. ఆ మేరకు కొత్త వాటిని మంజూరు చేసి 'లెక్క' సరిచేస్తున్నారు. అంటే 'ఒకరిని కొట్టి మరొకరికి పెట్టు' అనే తీరు ప్రభుత్వ లెక్కల్లో కనిపిస్తోంది. కొత్తగా దరఖాస్తు చేసుకుంటున్న వారి పింఛను మాత్రం కాగితాలకే పరిమితమవుతోంది. గత నాలుగేళ్ల నుంచీ ఇదే తంతు నడిపిస్తూ ఎక్కడోచోట జగన్ 'బటన్' నొక్కి హంగామా చేస్తూనే ఉన్నారనే విమర్శలు వినవస్తున్నాయి.



### మోసం ఇలా..

జిల్లాలోని అభయహస్తంతో కలుపుకొని మొత్తం 17 కేటగిరీల్లో పింఛన్లు ఇస్తున్నారు. వీటిలో దివ్యాంగులు, వృద్ధాప్య, ఒంటరి మహిళ, ట్రాన్స్‌జెండర్, వితంతు, కల్లుగీత కార్మికులు, చర్మకారులు, నేత కార్మికులు ఇలా 8 విభాగాలకు చెందిన లబ్ధిదారులకు నెలకు రూ.2,750 ఇస్తున్న పింఛన్‌ని జనవరి నుంచి రూ.3 వేలు చేశామని ప్రభుత్వం ఆర్భాటంగా చెప్పుకుంటోంది. కానీ ఆ మేరకు సరిపెట్టడం కోసం 11 కేటగిరీల సంఖ్యల్లో కోత విధించి.. ఐదు విభాగాల వాళ్ల సంఖ్యను కొద్దిగా పెంచారు. దివ్యాంగ లబ్ధిదారుల సంఖ్యలో 155 కోతపెట్టి 1022 కొత్తవి కలిపారు. ట్రాన్స్‌జెండర్లకు 1, వృద్ధాప్య 603 తీసేసి 1452, ఒంటరి మహిళ 17 లాగేసి 28, వితంతు పింఛన్లు 57 తొలగించి 1459 మంజూరు చేశారు. జిల్లాలో వృద్ధాప్య 603, కిడ్నీ తదితర రోగులవి 4, డప్పు కళాకారులు 4, దివ్యాంగులు 155, కళాకారులు 1, మత్స్యకార 7, ఒంటరి మహిళ 17, కల్లుగీత 3, నేత 4, వితంతు 57, హెచ్ఐవీ బాధితుల 40 పింఛన్లను తొలగించారు. ప్రతీ నియోజకవర్గంలోనూ లబ్ధిదారుల సంఖ్యను ఎంతోకొంత తగ్గించారు. అనపర్తి నియోజకవర్గంలో 75, గోపాలపురం 102, జగ్గంపేట (గోకవరం) 18, కొవ్వూరు 41, నిడదవోలు 113, రాజమహేంద్రవరం అర్బన్ 121, రూరల్ 76, రాజానగరం నియోజకవర్గంలో 133 మంది లబ్ధిదారులను పింఛన్ల జాబితా నుంచి కోసేశారు. దివ్యాంగులనూ ప్రభుత్వ మోసం వదల్లేదు. జిల్లాలో ఇప్పటివరకూ 32,597 మందికి పింఛను అందుతుండగా ఆ సంఖ్యను 32,442కి పరిమితం చేసి 1,022 కొత్తవి ఇచ్చినట్టు చూపిస్తున్నారు. దివ్యాంగులకు ఉండే ప్రత్యేక పరిస్థితుల వల్ల వాళ్లకు కాస్త ఎక్కువ మొత్తంలో పింఛను ఇచ్చేవారు. సాధారణ కేటగిరీలకు రూ.2 వేలు ఇచ్చినా వారికి రూ.3 వేలు ఇచ్చేవారు. కానీ ఇప్పుడు రూ.2,750 తీసుకునే వాళ్లతో వీరి పింఛను సమానమైపోయింది. దీంతో ప్రభుత్వం మాపై చూపించే అదనపు దయ ఏముందంటూ దివ్యాంగులు ఆవేదన చెందుతున్నారు.

### గారడీ ఇలా..

పాలకులు ప్రచార ఆర్భాటానికి ప్రగల్భాలు పలుకుతున్నా గణాంకాలు మాత్రం గారడీని బయట పెడుతున్నాయి. దాని అధికారులు కూడా సై అనడమే ఇక్కడ విషాదం. పింఛన్లు పెరగకుండానే అంకెల గారడీకి కొందరు అధికారులు సైతం భాగస్వాములవుతున్నారు. వాస్తవానికి ప్రభుత్వ లెక్కల ప్రకారం అభయహస్తం కాకుండా అమరావతి ల్యాండ్‌లెస్ పూర్, కిడ్నీ తదితర వ్యాధిగ్రస్తులు, డప్పు కళాకారులు, దివ్యాంగ, డీఎంహెచ్ఓ, కళాకారులు, సైనిక సంక్షేమ, ట్రాన్స్‌జెండర్, మత్స్యకార, వృద్ధాప్య ఒంటరి మహిళ, కల్లుగీత, చర్మకార, నేత కార్మికులు, వితంతు పింఛనుదారులు మొత్తం కలిపి డిసెంబరు1కి 2,36,759కి హెచ్ఐవీ బాధితులు 2,432 మందిని కలుపుకుంటే 2,39,191 మంది లబ్ధిదారులు ఉన్నారు. అదే జనవరి 1కి వచ్చేసరికి 2,36,022 మందికి హెచ్ఐవీవారు 2,392 కలుపుకుంటే మొత్తం లబ్ధిదారులు 2,38,414 మందిగా ఉన్నారు. అంటే 777 మందిని తొలగించినట్టు తెలుస్తోంది. దివ్యాంగుల లబ్ధిదారుల్లో 3శాతం, వృద్ధాప్య 1 శాతం, వితంతు లబ్ధిదారుల్లో 2శాతం స్వల్ప పెరుగుదలకు మాత్రమే ప్రభుత్వం కనికరించింది.

### అన్యాయం అలా..

ఓవైపు పీడిస్తున్న వ్యాధులకు పాలకుల తీరు తోడై బాధితులను మరింత ఆవేదనకు గురిచేస్తోంది. డిసెంబరులో ఉన్న లబ్ధిదారులను జనవరిలో తొలగించినట్టు గణాంకాల్లో చూపించారు. ఒక్కరికి కూడా కొత్తగా మంజూరు చేయలేదు. ఉదాహరణకు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకు సుమారు 600 వరకూ హెచ్ఐవీ వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. సుమారు 20 మందికి పాజిటివ్ వస్తోంది. వీరి వివరాలు ప్రభుత్వం వద్ద ఉంటాయి. కానీ ఒక్క కొత్త పింఛను కూడా మంజూరు చేయకపోగా 40 పింఛన్లను తొలగించారు. డిసెంబరు 1కి 2432 ఉన్న వారి పింఛన్ల సంఖ్య జనవరి 1కి 2392కి పడిపోయింది. పాలకుల తెలివితేటల గొప్పతనం చెప్పడానికి కిడ్నీ తదితర వ్యాధిగ్రస్తుల లబ్ధిదారుల సంఖ్య చాలు. ఆ లబ్ధిదారుల ప్రభుత్వ కేటగిరీలో 4 తొలగించి.. ప్రైవేటు విభాగంలో 4 తగిలించి లెక్క సరిపెట్టారు. అలాగే ట్రాన్స్‌జెండర్లకు ఒకేఒక్క కొత్త పింఛను మంజూరు చేశారు. వాళ్లను ట్రాన్స్‌జెండర్ ఆపరేషన్ జరిగినట్టు సర్టిఫికెట్ తెచ్చుకోమని చెప్పడంతో ఇబ్బంది తలెత్తుతోంది. ఎప్పుడో జరిగిన ఆపరేషన్‌కి సర్టిఫికెట్ ఎలా తెచ్చుకుంటామని వారంతా ప్రశ్నిస్తున్నారు. ఉదాహరణకు రాజమహేంద్రవరంలోని స్టేడియం సమీపంలో 30 మందికి ఇదే సమస్య ఎదురై పింఛను అందలేదు. ఏదొక మెలికపెట్టి పింఛన్లు ఎగ్గొడుతున్నారని వారు వాపోతున్నారు.

### లెక్కలు ఇలా..

| కేటగిరీల వారీగా | లబ్ధిదారులు డిసెంబరు1కి | జనవరి1కి |
|---|---|---|
| అమరావతి ల్యాండ్‌లెస్ | 3 | 3 |
| కిడ్నీ తదితర(ప్రభుత్వ) | 197 | 193 |
| కిడ్నీ తదితర(ప్రైవేటు) | 249 | 253 |
| డప్పు కళాకారులు | 757 | 753 |
| దివ్యాంగ | 32597 | 33464 |
| డీఎంహెచ్‌వో | 1467 | 1580 |
| కళాకారులు | 156 | 155 |
| సైనిక సంక్షేమ | 18 | 18 |
| ట్రాన్స్‌జెండర్ | 58 | 59 |
| మత్స్యకార | 1949 | 1942 |
| ఒంటరి మహిళ | 9160 | 9171 |
| కల్లుగీత కార్మికులు | 2502 | 2499 |
| చర్మకారులు | 864 | 864 |
| నేత కార్మికులు | 1351 | 1347 |
| వితంతు | 63609 | 65011 |
| హెచ్ఐవీ(ఏఆర్టీ) | 2432 | 2392 |

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఆంధ్రజ్యోతి www.andhrajyothy.com

## మితిమీరిన వేగం వద్దు: ఎస్ఐ



హైవేపై వేగ నిరోధకాలను ఏర్పాటు చేస్తున్న ఎస్ఐ సతీష్‌కుమార్, సిబ్బంది

గోపాలపురం, జనవరి 3: మితిమీరిన వేగంతో ప్రయాణించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. మండల పరిధిలో జాతీయ రహదారి 516డీపై ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యల్లో భాగంగా వేగ నిరోధకాలను ఏర్పాటు చేసినట్టు ఆయన బుధవారం తెలిపారు. పెద్దగూడెం జంక్షన్, గోపాలపురం జడ్పీ హైస్కూల్, కరిచర్లగూడెం, జగన్నాథపురం శివారులోని ఓంకార్ ఫెర్టిలైజర్స్, జడ్పీ హైస్కూల్, సంజీవపురం జంక్షన్‌రోడ్డు ప్రదేశాల్లో బారికేడ్లు, ఈ-రేడియం స్టిక్కర్లతో సిద్ధం చేసిన ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రయాణీకులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలన్నారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

## రేపు కొవ్వూరు మండల పరిషత్ సమావేశం

కొవ్వూరు, జనవరి 3: కొవ్వూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 5వ తేదీన నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కె.సుశీల తెలిపారు. శుక్రవారం ఉదయం 10గంటలకు ఎంపీపీ కాకర్ల నారాయుడు అధ్యక్షతన మండలంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి అంశాలపై చర్చించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశానికి మండలంలోని జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలన్నారు.

## కొవ్వూరులో 'ఆరోగ్య సురక్ష'

కొవ్వూరు, జనవరి 3: ఆరోగ్య సురక్ష శిబిరాల ద్వారా పేదల చెంతకే వైద్యాన్ని చేరువ చేస్తున్నట్టు మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి అన్నారు. కొవ్వూరులోని శ్రీరామకాలనీ 1వ సచివాలయం వద్ద బుధవారం నిర్వహించిన ఆరోగ్య సురక్షా కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి చికిత్సకు వచ్చిన ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ శిబిరంలో గైనకాలజిస్టు, పీడియాట్రిషియన్, జనరల్ ఫిజిషియన్లు 430 మందికి సేవలందించారు. కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, డీసీహెచ్ఎస్ కె.సనత్‌కుమారి, డీఎంహెచ్‌వో సంధ్య, డాక్టర్ తిరువీధుల సుష్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## 'జయహో బీసీ'ని విజయవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న టీడీపీ బీసీ నాయకులు

కొవ్వూరు, జనవరి 3: జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణారావు, జొన్న లగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన బీసీ నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 4న మంగళగిరిలో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రారంభించనున్న జయహో బీసీ కార్యక్రమంలో నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో గొర్రెల శ్రీధర్, రాజాన శ్రీనివాస్, కాగిత రఘు, కిలాని రమణ, యర్రా వాసుదేవరావు పాల్గొన్నారు.

## రేపు జిల్లా స్థాయి డ్యాన్స్ పోటీలు

నిడదవోలు, జనవరి 3: నిడదవోలులోని శ్రీచైతన్య కళా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 5న కోదూరి అచ్చయ్య కళాకేంద్రంలో (ఏబీఎస్ టౌన్‌హాలు) బాలబాలికలకు జిల్లా స్థాయి డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు గోనబోయిన శ్రీరామకృష్ణ పరమహంస తెలిపారు. 15ఏళ్లలోపు వయస్సు వారికి నిర్వహించే పోటీలకు అదే రోజు ఉదయం 10 గంటల్లోపు నమోదు చేసుకోవాలని చెప్పారు.

## ప్రకాశరావుపాలెంలో మెడికల్ టాస్క్‌ఫోర్స్ తనిఖీలు



ప్రకాశరావుపాలెం సచివాలయం వద్ద మెడికల్ టాస్క్‌ఫోర్స్ బృందం

నల్లజర్ల జనవరి 3: ప్రజారోగ్య వ్యవస్థ పనితీరును నేరుగా పరిశీలించేందుకు వైద్య ఆరోగ్యశాఖ జిల్లా టాస్క్ ఫోర్స్ ప్రత్యేక బృందం బుధవారం మండలంలోని ప్రకాశరావుపాలెంలో తనిఖీలు నిర్వహించింది. డీపీఎంవో డాక్టర్ అభిషేక్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా గణాంక అధికారి జె.కుమారస్వామి, డీపీహెచ్ఎన్‌వో వసంతలక్ష్మి, డీపీవో సంధ్యారెడ్డి, డేటా మేనేజర్ రామకృష్ణతో కూడిన బృందం ప్రకాశరావుపాలెంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు రకాలైన వైద్య సేవలు ప్రజలకు ఏ విధంగా అందుతున్నాయో నిశితంగా పరిశీలించారు. క్షేత్రస్థాయిలో స్వయంగా ఇంటింటికీ వెళ్లి ఆరా తీశారు. విద్యార్థులు, గర్భిణుల ఎంసీపీ కార్డులు, చిన్నపిల్లల టీకాల రికార్డులు తనిఖీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గంగాధర్, పలివెల ప్రసాదరావు, జీవీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

## దేవరపల్లిలో భారీ అన్నసమారాధన

దేవరపల్లి, జనవరి 3: దేవరపల్లిలో ప్రసన్నాంజనేయస్వామి జయంతి వేడుకలు ముగింపు సందర్భంగా ఆలయం వద్ద ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. లక్ష తమలపాకులతో పూజలు చేశారు. భారీ అన్నసమారాధన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఓరుగంటి వెంకటపతిరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అపూర్వ విద్యార్థుల సమ్మేళనం



నల్లజర్ల జడ్పీ హైస్కూల్ 1989-90 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు

నల్లజర్ల జనవరి 3: నల్లజర్ల జడ్పీ హైస్కూల్లో 1989-90 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం నల్లజర్ల అల్లాడ రామకృష్ణ కళ్యాణ మండపంలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఒకరికొకరు యోగక్షేమాలు తెలుసుకుని, చిన్ననాటి సంగతులను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువులు గొట్టిపాటి శ్రీరామూర్తి,దత్తులను సత్కరించారు. భద్రాచలం నుంచి తాళ్లరి నారాయణరావు, విశాఖ నుంచి శేషుకుమార్, పద్మలత, హైదరాబాద్ నుంచి సత్యసాయి హాజరయ్యారు. కార్యక్రమాన్ని నిర్వహించిన స్నేహితుడు మద్దిపాటి ప్రసాద్(ఎంపీ)ను సత్కరించారు.

## వాసవిక్లబ్ వనితా నూతన కార్యవర్గం

నిడదవోలు, జనవరి 3: నిడదవోలులోని వాసవిక్లబ్ వనితా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం స్థానిక మదన గోపాలస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి జరిగింది. నిడదవోలు అధ్యక్షురాలిగా సింహాద్రి శిరీష, కార్యదర్శిగా గొల్లపూడి గాయత్రి, ట్రెజరర్‌గా జవ్వాది శిరీష, ఉదయగిరి మణి, వంకాయల వాసవి, జాయింట్ సెక్రటరీలుగా అనంత శిరీష, కొత్త గీత, పీఆర్వోగా దివ్వెల ఫణిమాధురి, పలువురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో ఇంటర్నేషనల్ అడిషినల్ ట్రెజరర్ ఓలేటి శ్రీనివాసగుప్త, డిస్ట్రిక్ట్ గవర్నర్ వలివేటి ఎల్ఎస్‌వీ ప్రసాద్ పాల్గొన్నారు.

## వేలివెన్నులో క్రికెట్ పోటీలు

ఉండ్రాజవరం, డిసెంబరు 3: యువత క్రీడల పట్ల ఆసక్తి చూపాలని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా వేలివెన్నులో శశిధర్ మెమోరియల్ క్రికెట్ పోటీలను బుధవారం ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని, ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సాహించాలన్నారు. ఈ పోటీల్లో 56 జట్లు పాల్గొంటున్నట్టు టోర్నమెంట్ కన్వీనర్ బూరుగుపల్లి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను

# రెగ్యులరైజ్ చేయాలి

- ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ నాయకుడు భాస్కరరావు
- నిడదవోలు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన

నిడదవోలు, జనవరి 3: ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటి నాయకుడు రేఖా భాస్కరరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్త పారిశుధ్య కార్మికుల సమ్మెలో భాగంగా బుధవారం నిడదవోలు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పుననుసరించి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, పర్మినెంటు కార్మికులకు 2021 నుంచి ఇవ్వవలసిన సరెండర్ లీవ్ ఎన్‌కేష్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



కొవ్వూరులో మానవహారం నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు



నిడదవోలులో నిరసన తెలుపుతున్న కార్మికులు

కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మాముడూరి నాగేంద్రవరప్రసాద్, క్రొవ్విడి నాగరాజు, కాకి అప్పలరాజు, బొచ్చా ముద్దుకృష్ణ, బండారు రాంబాబు, జగ్గమ్మ, లక్ష్మీదుర్గ, తూరుగోపుల లక్ష్మి పాల్గొన్నారు.

### కొవ్వూరులో రెగ్యులర్ కార్మికుల అడ్డగింపు

కొవ్వూరు, జనవరి 3: కొవ్వూరులో మున్సిపల్ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు 9వ రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. బుధవారం ఉదయం మున్సిపల్ కార్యాలయం నుంచి పర్మినెంటు కార్మికులు విధుల్లోకి వెళ్లకుండా అడ్డుకున్నారు. సమాచారం తెలుసుకున్న కమిషనర్ బి.శ్రీకాంత్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఈ క్రమంలో కార్మికులు, అధికారుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. కార్మికులతో కమిషనర్ చర్చించడంతో కాంట్రాక్టు కార్మికులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అనంతరం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం నుంచి పట్టణంలో భిక్షాటన చేస్తూ ర్యాలీ నిర్వహించారు. మెయిన్‌రోడ్‌లోని వైఎస్సార్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. విజయవిహార్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి సీఎం జగన్ హామీలను బేషరతుగా అమలు చేయాలంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆర్.అప్పారావు, ఎం.కిషోర్, పి.వాసు, బి.రవీంద్ర, కె.రాజేష్, ఎం.ప్రేమ్, ఎం.జ్యోతి, కె.ప్రసాద్, ఎం.శ్రీను, వి.శ్యాం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు తదితరులు పాల్గొన్నారు.

# రాజేశ్వరి రామకృష్ణన్ సేవలు చిరస్మరణీయం

- సంతాప కార్యక్రమంలో సినీ దర్శకుడు వీవీ వినాయక్

చాగల్లు, జనవరి 3: జైపూర్ షుగర్ కంపెనీ చైర్‌పర్సన్ రాజేశ్వరి రామకృష్ణన్ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఈప్రాంత రైతులు, ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి చేసిన కృషి చిరస్మరణీయమని సినీ దర్శకుడు వీవీ వినాయక్ అన్నారు. రాజేశ్వరి రామకృష్ణన్ సంతాప కార్యక్రమం బుధవారం స్థానిక ఫ్యాక్టరీ ఆవరణలో జరిగింది. కార్యక్రమంలో ఆళ్ల శివకుమార్, కోపరేటివ్ స్టోర్స్ మేనేజర్ దండమూడి వీర వెంకటరావు, గంధ్రోతు సురేంద్రకుమార్, కొడవటి కాశీ విశ్వనాథం, జుట్టు దుకొండలు, ఫ్యాక్టరీ కార్మిక సంఘం నాయకులు కరుటూరి సత్యనారాయణ, అబ్బిన రమేష్, చిన్నారావు పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు.



రాజేశ్వరి రామకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీవీ వినాయక్

### వినాయకుడి గుడిలో పూజలు..

స్వగ్రామమైన చాగల్లు విచ్చేసి వీవీ వినాయక్ స్థానిక తెలగాసంఘం వినాయకుడు గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పెంజర్ల గణేష్, అతని కుమారులు ప్రారంభించిన పప్పులమిల్లును సందర్శించారు.

# మంగళగిరి తరలిన టీడీపీ శ్రేణులు



మంగళగిరిలో సమావేశానికి వెళ్లే వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం/నిడదవోలు, జనవరి 3: రాష్ట్ర సర్పంచుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం మంగళగిరిలో జరిగిన సర్పంచుల సమావేశానికి నిడదవోలు నియోజకవర్గం నుంచి ప్రస్తుత, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డు కౌన్సిలర్లు సుమారు 150 మంది వెళ్లారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు వేలివెన్నులో జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, తిరుపతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. కాగా నిడదవోలు మండలం నుంచి టీడీపీ సర్పంచులు ఆరేపల్లి భాగ్యలక్ష్మి(గోపవరం), యర్రా రామకృష్ణ(తాళ్లపాలెం), దాయం రత్నకుమారి(ఆట్లపాడు), రాధా కృష్ణ(కోరుపల్లి), దొరబాబు(కలవచర్ల), మున్సిపల్ కౌన్సిలర్ కారింకి నాగేశ్వరరావు వెళ్లారు.

**నల్లజర్ల:** గోపాలపురం నియోజకవర్గం నుంచి జడ్పీ మాజీ చైర్మన్ ముళ్లపూడి బాపిరాజు, మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు నాయకత్వంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, టీడీపీ నాయకులు మంగళగిరి వెళ్లారు. వెళ్లిన వారిలో చీపురుగూడెం ఎంపీటీసీ రావూరి వెంకట రమణ, గుదే సుబ్బారావు, మల్లిపూడి కృష్ణరావు, సవలం రామకృష్ణ, భార్గవ్ ఉన్నారు.



సమావేశంలో నల్లజర్ల టీడీపీ నాయకులు

# ఈవీఎంలపై అవగాహన అవసరం



తాళ్లపూడిలో ఈవీఎంల పనితీరు వివరిస్తున్న దృశ్యం

ఉండ్రాజవరం, జనవరి 3: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం(ఈవీఎం)పై ఓటర్లు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో జీవీఎస్‌కేఆర్ రాజు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పాలంగిలో ఈవీఎంలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఓటింగ్ యంత్రాలు వినియోగిస్తారని, ప్రతిఒక్కరూ ఓటును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బొక్కా శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఎమ్‌డీ హసన్‌జాని, వీఆర్వో కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**తాళ్లపూడి:** తాళ్లపూడి పంచాయతీ కార్యాలయం వద్ద ఈవీఎంలు పనిచేసే విధానంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ప్రత్యేకాధికారి అమ్మిరాజు తెలిపారు. మండలంలో ఐదు బృందాలు ఈవీఎంలపై అవగాహన సదస్సులు చేపట్టాయన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆశాఅలేఖ్య, బీఎల్‌వోలు, సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

కొవ్వూరు, జనవరి 3: కొవ్వూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా కళాశాలలో ఆమె చిత్రపటానికి ప్రిన్సిపాల్ జె.సునీత పూలమాలవేసి నివాళులర్పించారు. సావిత్రిబాయి ఉద్యమస్ఫూర్తిని, త్యాగనిరతిని విద్యార్థులు అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మళ్ల పుష్పాంజలి, అప్పల నరసింహం, ఒ.శ్రీనివాసు, వెనేల, కాంచనమాల, సత్యసునీత, పాల్గొన్నారు.

**తాళ్లపూడి:** మండలంలోని రాగోలపల్లి ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దుర్గారావు మాట్లాడుతూ సావిత్రీబాయి 1831 జనవరి 3న జన్మించిందని, ఇంటి వద్దే మంచి చదువులు చదివి దేశంలోనే మొదటి ఉపాధ్యాయురాలిగా నిలిచిందని, విద్యాలయాలు స్థాపించి మహిళా అభ్యుదయానికి పాటు పడిందన్నారు.

**దేవరపల్లి:** మండలంలోని గౌరీపట్నంలో జరిగిన కార్యక్రమంలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ కుండా వినాయక్‌విజయ్, మహిళా ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వినాయక్ విజయ్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే స్త్రీ విద్య కోసం పాటుపడ్డారని అన్నారు. బాలబాలికలను వీధిబాలలను దత్తత తీసుకుని వారి చదువుకు ప్రోత్సహించారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమాదేవి, ఎం.మహలక్ష్మి, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ

కొవ్వూరు, జనవరి 3: అయోధ్య శ్రీరామ జన్మభూమి నుంచి వచ్చిన అక్షింతలను కొవ్వూరులో బుధవారం పంపిణీ చేశారు. అర్చకులు మానేపల్లి సుబ్రహ్మణ్య శాస్త్రి మాట్లాడుతూ ఈ నెల 1నుంచి 15 వరకు అక్షింతలతో పాటు కరపత్రాలు శ్రీరాముని ఫొటోలు ఇంటింటికి పంపిణీ చేస్తామన్నారు. అక్షింతలు వచ్చిన భక్తులు వారి ఇళ్లలో ఈ నెల 22న 5 దీపాలను వెలగించి రెండు దీపాలు పూజా మందిరంలో రెండు గడపకు ఇరుపక్కలా, మరో దీపం తులసి కోట వద్ద ఉంచి ఇంటిల్లపాది అక్షింతలు తలపై వేసుకోవాలన్నారు. కార్యలక్రమంలో తురగ విజయభాస్కర్, కొండపల్లి రత్నసాయి పాల్గొన్నారు.

**పెరవలి:** మండలంలోని ముక్కామలలో జరిగిన కార్యక్రమంలో కలశాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ సభ్యులు, గ్రామస్థులు రామనామ సంకీర్తనలు, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలతో వైభవంగా ఊరేగింపు జరిగింది. ఈ సందర్భంగా ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు.

**గోపాలపురం:** మండలంలోని వాదాలకుంట గ్రామంలో విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు దేవిన శ్రీనివాసరావు, వెలగా ప్రసాద్ ఆధ్వర్యంలో మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మహిళా భక్తబృందం అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. గ్రామానికి 5 కిలోల చొప్పున వాదాలకుంట పంచాయతీ పరిధిలోని వెదుళ్లకుంటకు 2 కిలోలు, వాదాలకుంటకు 3 కిలోలు కేటాయించినట్టు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో భగవత్‌గీత అధ్యాయన లైవ్ గీతా మెంటర్ వెలగా కల్యాణి, మాదుగుల సురేష్, సుధాకర్, వెంకటేశ్వరరావు, పద్మ, రత్నావతి, కనకదుర్గ, దుగ్గిరాల శ్రీదేవి, భజనగురువు గోపాలరావు పాల్గొన్నారు.



పెరవలి: ముక్కామలలో కలశాలతో ఊరేగింపు

## హోం మంత్రిని కలిసిన ఐజీ అశోక్‌కుమార్



కొవ్వూరు, జనవరి 3: హోం మంత్రి తానేటి వనితను ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏలూరు రేంజ్ డీఐజీగా పనిచేస్తూ ఐజీగా పదోన్నతి పొందిన అశోక్‌కుమార్ బుధవారం కొవ్వూరులోని క్యాంపు కార్యాలయంలో హోం మంత్రిని కలిశారు. పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఐజీ వెంట జిల్లా ఎస్పీ జగదీష్ ఉన్నారు.

## రానున్న ఎన్నికలకు స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



స్ట్రాంగ్ రూమ్ పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ తదితర అధికారులు

దివాన్‌చెరువు, జనవరి 3: రానున్న సాధారణ ఎన్నికల సందర్భంగా జిల్లా పరిధిలోని రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి లెక్కింపు కేంద్రం, ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లను నన్నయ విశ్వవిద్యాలయంలో సంబంధిత అధికారులతో కలసి ముందస్తుగా పరిశీలించినట్లు కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.మాధవీలత తెలిపారు. బుధవారం నన్నయ విశ్వవిద్యాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ పి.జగదీష్, ఇతర అధికారులతో కలసి కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం పలు సూచనలు చేశారు. నియోజకవర్గాల గదుల కేటాయింపు, ఆయా నియోజకవర్గాల నుంచి వచ్చే ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్, అక్కడి నుంచి కౌంటింగ్ కేంద్రాలకు వెళ్లే రూట్ మ్యాప్, భద్రత తదితర అంశాలను దృష్టిలో పెట్టుకుని మ్యాప్‌ను పరిశీలించారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల మార్గదర్శకాల మేరకు మూడు అంచెల భద్రత తదితర అంశాలపై కూలంకషంగా క్షేత్రస్థాయి పరిశీలన చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్‌భరత్, నగరపాలక సంస్థ కమిషనర్ దినేష్ కుమార్, కొవ్వూరు సబ్‌కలెక్టర్ అశుతోష్‌శ్రీవాత్సవ్, డీఆర్వో నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి తదితరులు పాల్గొన్నారు.

## శారదాదేవి జయంతి ఉత్సవాలు

నిడదవోలు, జనవరి 3: నిడదవోలులోని శ్రీరామకృష్ణా సేవా సమితిలో బుధవారం మాతృదేవి శారదాదేవి జయంతి ఉత్సవాలు జరిగాయి. ఉదయం మంగళహారతితో ప్రారంభమై స్తోత్ర పారాయణం, విశేష పూజలు భజన, మధ్యాహ్నం హారతి, ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో జీవీవీ సత్యనారాయణ, నూతులపాటి రాంబాబు, పి.సాగరం తదితర్లు పాల్గొన్నారు.